PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 165 | విజయవాడ, శనివారం 20 జనవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 20 January 2024 | Rs

లొంగిపోవాల్సిందే



- గడువు పెంచేది లేదు
- బిల్కిస్ బానో కేసులో దోషులకు స్పష్టం చేసిన సుప్రీం

• లోపలి పేజీలో..•



ఒలింపిక్స్ నుంచి ఇజ్రాయెల్‌ను బహిష్కరించండి

- ఐఒసికి పాలస్తీనా పౌర సమాజం విజ్ఞప్తి

• లోపలి పేజీలో..•

సామాజిక న్యాయమే లక్ష్యం



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి జగన్

- విజయవాడలో భారీ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సిఎం
- అంటరానితనం రూపు మార్చుకుంటోందని వ్యాఖ్య
- చంద్రబాబు దళితులకు చేసింది శూన్యమని విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సామాజిక న్యాయమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో 'స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్' పేరిట ఏర్పాటు చేసిన భారీ అంబేద్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. 206 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఈ భారీ విగ్రహంలో 81 అడుగుల మేర పీఠం ఏర్పాటు చేశారు. అంబేద్కర్ కాంస్య విగ్రహం ఎత్తు 125 అడుగులు. ఈ విగ్రహ ఏర్పాటు కోసం 404.35 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసింది. శుక్రవారం జరిగిన ఆవిష్కరణ కార్యక్రమాన్ని సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించింది. విగ్రహావిష్కరణకు ముందు సామాజిక సంకల్ప సభ పేరుతో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో భారీ కార్యక్రమాన్ని నిర్వహించింది. భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజానీకం చేస్తున్న నినాదాల మధ్య ప్రసంగించిన అనంతరం సిఎం జగన్మోహన్‌రెడ్డి స్వరాజ్‌మైదాన్‌కు వెళ్లి అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు సభలో మాట్లాడుతూ తన 56నెలల పాలనలో చేపట్టిన సామాజిక న్యాయ కార్యకలాపాలను వివరించారు. సామాజిక న్యాయానికి పెద్ద పీట వేసినట్లు చెప్పారు. అభివృద్ధికి, అభ్యుదయానికి మధ్య అవినాభావ సంబంధం అంబేద్కర్ భావజాలమన్నారు.స్టాట్యూ ఆఫ్ లిబర్టీ అంటే అంటే అందరికీ అమెరికా గుర్తొస్తుందని, రానున్న రోజుల్లో స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ అంటే ఇండియాలో విజయవాడ పేరు గుర్తుకువస్తుందని అన్నారు. నేడు విజయవాడను చూస్తుంటే సామాజిక చైతన్యల వాడగా కనిపిస్తోందన్నారు. అనేక సంవత్సరాల భారత సామాజిక , ఆర్థిక , మహిళా చరిత్రను మార్చిన ఓ సంఘ సంస్కర్త, ఓ మరణంలేని మహానీయుని విగ్రహాన్ని విజయవాడలో ఆవిష్కరించామన్నారు. ఆయన జన్మించిన 133 సంవత్సరాల తర్వాత , మరణించిన 68 సంవత్సరాల తర్వాత ఈ విగ్రహాన్ని స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టీస్-సామాజిక న్యాయ మహాశిల్పం పేరుతో ఏర్పాటు చేసుకుంటున్నట్లు చెప్పారు. అంటరాని తనం నేడు రూపం మార్చుకుంటోందని చెప్పారు వ్యక్తుల్ని భౌతికంగా ముట్టుకోకూడని, దూరం పెట్టడం మాత్రమే అంటరాని తనం కాదని అన్నారు. అంటరాని తనమంటే పేదలు ఏ బడిలో చదువుకుంటున్నారో, ఆ ప్రభుత్వ బడిని పాడుపెట్టడం (మరమత్తులు చేయకుండా) కూడా రూపం మార్చుకున్న అంటరాని తనమేనన్నారు. పేద కులాలవారు ఎప్పటికీ తమ పొలాల్లో పనివారుగా ఉండాలని, తమ ఇళ్లలో పనివారుగా తమకు సేవకులుగా ఉండి పోవాలనే ఆలోచనలు కూడా అంటరానితనమేనని సిఎం వెల్లడించారు. పేదలకు గవర్నమెంట్ ఆసుపత్రుల్లో ఎక్కడైతే ఉచిత వైద్యం అందుతుందో అటువంటి ఆసుపత్రులు నీరు గార్చడం, పేదలు ఏ బస్సులో ఎక్కుతున్నారో , ఆ ఆర్టీసీని కూడా ప్రైవేటుకు అమ్మేయాలనుకోవడం ఇవన్నీ కూడా రూపం మార్చుకున్న అంటరాని తనమేనని సిఎం వెల్లడించారు. అంబేద్కర్‌ను అంటరాని తనం, ఆధిపత్య మిగతా 7లో



విజయవాడలో ధర్నా చౌక్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న అంగన్‌వాడీ సంఘాల నాయకులకు సంఘీభావం తెలియజేస్తున్న సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు వరలక్ష్మి

అంబేద్కర్ విగ్రహాల వద్ద సత్యాగ్రహ దీక్షలు

- 39వ రోజూ కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె
- విజయవాడకు వెళ్లనీయకుండా అరెస్టులు, గృహనిర్బంధాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

అంగన్‌వాడీలు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాల వద్ద శుక్రవారం సత్యాగ్రహ దీక్షలు నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మనసు మారే విధంగా హితబోధ చేయాలని, తమ వేతనాలు పెంచేలా చూడాలని వేడుకున్నారు. అంగన్‌వాడీల సమ్మె 39 రోజూ కొనసాగింది. వివిధ రూపాల్లో నిరసనలు కొనసాగించారు. విజయవాడలో జరుగుతున్న నిరవధిక నిరాహార దీక్షలకు రానీయకుండా అంగన్‌వాడీలను, సిఐటియు నాయకులను పలు జిల్లాల్లో పోలీసులు అరెస్టు, గృహనిర్బంధం చేశారు. వేతనం పెంపు, ఇతర సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీలు తేల్చి చెప్పారు.

విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఎల్‌ఐసి కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. వారి పోరాటానికి బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్, విశాఖలోని మిగతా 2లో

గుండెపోటుతో అంగన్‌వాడీ వర్కర్ మృతి



అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పెదపేటకు చెందిన 78వ సెంటర్ అంగన్‌వాడీ వర్కర్ కొత్తపల్లి శాంతకుమారి (50) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. సమ్మె విరమించాలంటూ ప్రభుత్వం షోకాజ్ నోటీసులు ఇవ్వడంతో ఉద్యోగం పోతుందేమోనని మనోవేదనకు ఆమె గురయ్యారని కుటుంబసభ్యులు తెలిపారు. కొత్తపేట సిడిపిఒ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరానికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయి శాంతకుమారి మృతి చెందారు.

బాధ్యులపై కఠిన చర్యలు

- బోగస్ ఓటర్ ఐడి కార్డులపై సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఓటర్ల లిస్టులో బోగస్ ఓట్లు చేర్చేందుకు, నకిలీ ఓటరు ఐడి కార్డులు తయారు చేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రకటన విడుదల చేశారు. ఒకసారి ఓటర్ల తుది జాబితా ప్రకటించాక దానిని మార్చడానికి వీలు లేకుండా సాంకేతికమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలు, మునిసిపల్ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగానూ విస్తారంగా బోగస్ ఓట్లను చేరుస్తున్నారని పదేపద సిఇఓతో పాటు ఇతర ఎన్నికల అధికారులకు తాము పిటిషన్లు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. తిరుపతి ఉప ఎన్నికల సందర్భంగా వేలాది బోగస్ ఐడి కార్డులు తయారు చేయించిన వైనం ఆనాడే పెద్ద ఎత్తున బట్టబయలైందని పేర్కొన్నారు. వందలాది తప్పుడు ఐడి కార్డులను జిల్లా కలెక్టర్‌కు సిపిఎం అందజేసిందని తెలిపారు. ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలను ఆపాలని దొంగ ఓటర్లను అనుమతించరాదని ఎన్నికలుజరిగే రోజే ధర్నా చేయడం జరిగిందని తెలిపారు. నేడు కేంద్ర ఎన్నికల కమిషన్ విచారణలో ఎన్నికల అధికారిగా ఉన్న వ్యక్తి ఐడి నుంచే బోగస్‌ఐడి కార్డులు తయారు చేశారని వెల్లడైందని, ఇది పెద్ద కుంభకోణమని, ఇటువంటివి జరగడం ప్రజాస్వామ్య ప్రక్రియకే పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. బోగస్ ఓటర్ ఐడి కార్డులను తయారు చేయడమంటే ఎన్నికలను తారుమారుచేయడమేనని, ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని సంబంధిత భాద్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారిని ప్రోత్సహించి, తోడ్పాటునందించిన వారందరి పైనా చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. అధికారపార్టీ ప్రమేయం లేకుండా ఇంత పెద్ద ఎత్తున తప్పుడు ఓట్లను చేర్చడం, మార్ఫింగ్ చేయడం జరగదని, ఈ తరహా మోసాలు భవిష్యతులో జరగకుండా ఉండేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారులను జంబ్లింగ్ పద్దతిలో మార్పులు చేయాలని, ఇవిఎంలను పారదర్శక పద్ధతిలోజంబ్లింగ్ చేయాలని కోరారు. ఓటర్లలో విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు. రాష్ట్రంలో త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికలు పారదర్శకంగా, స్వేచ్ఛగా, ప్రజాస్వామ్యయుతంగా జరిగేటట్లు ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు.

మోసకారి సంక్షేమాన్ని చూసి మోసపోవద్దు

- రాయలసీమను రతనాల సీమగా మారుస్తాం
- రివర్స్ గేర్‌లో జగనన్న బాణం
- రా..కదలిరా సభల్లో చంద్రబాబు నాయుడు



వైఎస్‌ఆర్ జిల్లా కమలాపురం సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి- వెంకటగిరి తిరుపతి జిల్లా, కడప ప్రతినిధి

జగన్ మోసకారి సంక్షేమాన్ని చూసి మోసపోవద్దని, ఒక చేత్తో రూ.15 పైసలిచ్చి మరో చేత్తో రూపాయి లాక్కుంటున్నారని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. 'నాకు ఒక్కసారి అవకాశం ఇవ్వండి' అనే పేరుతో జగన్ అధికారానికి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వస్తే సంపద సృష్టించి రాష్ట్రాభివృద్ధికి పాటుపడతానని, సాగునీటి ప్రాజెక్టుల పనులను పరుగులు పెట్టిస్తానని, రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని హామీ ఇచ్చారు. శుక్రవారం వైఎస్‌ఆర్, తిరుపతి జిల్లాల్లో రా..కదలిరా సభల్లో చంద్రబాబు మాట్లాడుతూ.. సాగర్ నీటిని నల్లమలలో టన్నెల్ తవ్వి నంద్యాల జిల్లా బనకచర్లలో పోసి రాయలసీమ తల రాతనే మారుస్తామని అన్నారు. వైసిపి అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలను పెంచబోమని హామీనిచ్చి తొమ్మిదిసార్లు పెంచారని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వస్తే రాబోయే ఐదేళ్లు కరెంటు ఛార్జీలను పెంచబోమని, ఇదే సమయంలో చేనేతలకు 200 యూనిట్లు ఉచితంగా కరెంటు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 29 మంది దళిత ఎమ్మెల్యేలను ట్రాన్స్‌ఫర్ చేయడం దారుణమన్నారు. 'వైసిపి నేతలు ఇసుక నుంచి తైలం తీస్తారు. పెన్నా నది నుంచి ఇసుకను దొంగ రవాణా చేస్తారు. 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టి జగన్ తన కడుపు నింపుకుంటున్నారు' అని విమర్శించారు. వైఎస్‌ఆర్ జిల్లా ప్రొద్దుటూరులో నందం సుబ్బయ్య, పులివెందులలో దళిత మహిళ నాగమ్మ హత్య మొదలుకుని ఓ ఎమ్మెల్సీ తన డ్రైవరును చంపి కారులో డోర్ డెలివరీ చేయడం ఏ రకమైన సామాజిక సాధికారత అంటూ ఎద్దేవా చేశారు. తన చిన్నాన్న వైఎస్ వివేకాను చంపి ఇతరులపై నిందమోపడం దారుణమన్నారు. తన సోదరుడైన కడప ఎంపిని కాపాడుకోవడానికి సిబిఐపైనే కేసులు పెట్టగలగిన తెంపరితనాన్ని చూస్తే పోలీసులను సైతం చంపి ఆత్మహత్యలుగా చిత్రీకరించే అవకాశం ఉందన్నారు. జగనన్న వదిలిన బాణం మిగతా 2లో

ఎస్‌సి వర్గీకరణపై కమిటీ

- ఐదుగురు సభ్యులతో నియామకం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎస్‌సి వర్గీకరణపై ఐదుగురు సభ్యులతో కమిటీని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఏర్పాటు చేసింది. కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా నాయకత్వం వహించనున్న ఈ కమిటీలో కేంద్ర హోం, న్యాయ, గిరిజన, సామాజిక న్యాయశాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. ఈ నెల 22న ఈ కమిటీ తొలిసారి సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. మాదిగల వంటి షెడ్యూల్డ్ కులాల ప్రయోజనాలను పరిరక్షించడానికి, వారి వాటాకు అనుగుణంగా ప్రయోజనాలు పొందడం తదితర అంశాలపై తీసుకోగలిగిన పరిపాలనాపరమైన చర్యలను ఈ కమిటీ పరిశీలించనుంది. ఎస్సీ వర్గీకరణపై ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుకు గతంలో సుప్రీంకోర్టు అంగీకారం తెలపడంతో కేంద్రం ఈ కమిటీని ఏర్పాటు చేసింది.

'స్టార్' రేటింగ్‌తోనే కొత్త పంపుసెట్లు

- విద్యుత్ ఆదాపై ఇంధనశాఖ నిర్ణయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

మున్సిపాల్టీలు, పంచాయతీల్లో వినియోగించే తాగునీటి పంపుసెట్లను ఇకపై అత్యంత నాణ్యత కలిగిన వాటినే వినియోగించాలని ఇంధన శాఖ నిర్ణయించింది. పురాతన, చెడిపోయిన వాటిని వినియోగించడం వల్ల విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటోందని పేర్కొంది. పాత వాటిని మార్పు చేసి, కొత్త పంపు సెట్లను ఏర్పాటుచేసే సమయంలో స్టార్ రేటింగ్స్ ఉన్నవాటినే ఉపయోగించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని శాఖలకూ మార్గదర్శకాలు జారీ చేసింది.ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 239 పంపు సెట్లను మార్పు చేయాల్సి ఉంటుందని ఇటీవల నిర్వహించిన ఇన్‌వెస్ట్‌మెంట్ గ్రేడ్ ఎలక్ట్రికల్ ఆడిట్ నిర్వహించిన ఒక సర్వేలో గుర్తించినట్లు ఇంధనశాఖ వివరించింది. వీటిని మార్పు చేయడం వల్ల ఏటా 25 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. ఈ ఆదా విలువ రూ.20 కోట్లుగా ఉంటుందని మిగతా 2లో

'ఒకే దేశం..ఒకే ఎన్నిక' అప్రజాస్వామికం

- జమిలీకి కాంగ్రెస్ వ్యతిరేకం
- కోవింద్ కమిటీకి మల్లికార్జున్ ఖర్గే లేఖ



ప్రజాశక్తి -న్యూఢిల్లీ బ్యూరో

ఒకే దేశం, ఒకే ఎన్నిక అప్రజాస్వామికమని, ఆ ఆలోచన రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణానికి వ్యతిరేకమని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనే ఆలోచనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఇది ఫెడరలిజం హామీలకు విరుద్ధమైన అప్రజాస్వామిక ఆలోచన అని చెప్పారు. 'వన్ నేషన్ వన్ ఎలక్షన్'పై కేంద్రం ఉన్నత స్థాయి కమిటీ కార్యదర్శి డాక్టర్ నితిన్ చంద్రకు ఖర్గే నాలుగు పేజీల లేఖను రాశారు. 'రాజ్యాంగం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని తారుమారు చేసేందుకు మాజీ రాష్ట్రపతి పదవిని దుర్వినియోగం చేయొద్దు' అని ప్యానెల్ చైర్‌పర్సన్ కోవింద్‌ను కోరారు. ఈ కమిటీలో ప్రతిపక్షానికి తగిన ప్రాతినిధ్యం లేదని అన్నారు. కమిటీలో వివిధ రాష్ట్రాల్లోని ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు చోటు కల్పించలేదని, ఈ విషయంలో పక్షపాత ధోరణి అవలంబించారని విమర్శించారు. వన్ ఎలక్షన్ అనే ఆలోచనను ఉన్నత స్థాయి కమిటీ ఇప్పటికైనా విరమించుకోవాలని, దీనికి సంబంధించి ఏర్పాటైన హైపవర్ కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు. ఒకే ఎన్నికలంటూ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని ఖర్గే పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు నిధుల విషయంలో పారదర్శకత పాటించాలని కోరారు.

లోక్‌సభ ఎన్నికలకు ముందే కమిటీ నివేదిక

దేశంలో ఒకేసారి ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ తుది దశలో ఉన్న తన నివేదికను వచ్చే లోక్‌సభ ఎన్నికలలోపు కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని యోచిస్తోంది. 'ఫిబ్రవరి లేదా మార్చిలో ఎప్పుడైనా నివేదిక సమర్పించే అవకాశముంది' అని కమిటీ సభ్యులు తెలిపారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానంపై ఉన్నత స్థాయి కమిటీ (హెచ్‌ఎల్‌సి) ముందున్న ప్రధాన కర్తవ్యం - నివేదికను ఖరారు చేయడంలో ఎన్నికల సంఘం (ఇసి), రాజ్యాంగ న్యాయస్థానాల మాజీ న్యాయమూర్తులు, ప్రముఖ న్యాయనిపుణులు, మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్లు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజలు, 22వ లా కమిషన్ వివిధ భాగస్వాముల నుంచి వచ్చిన సూచనలను చేర్చడమని చెప్పారు.

హెచ్‌ఎల్‌సి ఇప్పటికే సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభించింది. మద్రాస్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మునీశ్వర్ నాథ్ భండారీని చైర్‌పర్సన్ కోవింద్ ఢిల్లీలో బుధవారం కలిశారు. ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గొర్ల రోహిణి, మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ సుశీల్ చంద్రతో గురువారం చర్చించారు. ఈ నెల 15 వరకు కమిటీకి ప్రజల నుంచి ఈమెయిల్‌ల ద్వారా 15,000, వన్ నేషన్ వన్ ఎలక్షన్ వెబ్‌సైట్ ద్వారా మరో 12,000 ప్రతిస్పందనలు అందాయి. దాదాపు 70 శాతం మంది ప్రతిస్పందనదారులు ఏకకాల పోల్స్ ఆలోచనను సమర్థించారని తెలిపారు. ప్యానెల్ తన సూచనల కోసం ఇసిని కూడా సంప్రదించిందని, అయితే దానికి ఇంకా స్పందన రాలేదన్నారు.

గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన రెండో సమావేశం తరువాత లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో మూడంచెల ఎన్నికలను నిర్వహించడంపై తమ సూచనలను కోరుతూ ఆరు జాతీయ పార్టీలు, 33 రాష్ట్ర పార్టీలకు కమిటీ లేఖ రాసిన విషయం మిగతా 7లో

సిఎం జగన్ అక్రమాస్తుల కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అక్రమాస్తుల కేసులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెయిల్ రద్దు సహా ఇతరులపై నమోదైన కేసుల విచారణను తెలుగు రాష్ట్రాల నుంచి బదిలీ చేయాలని ఎంపి రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. జగన్ అక్రమాస్తుల కేసుల విచారణ ఎందుకు ఆలస్యమవుతోందని ధర్మాసనం ప్రశ్నించింది. ఇందుకు తాము బాధ్యులం కాదని సిబిఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పగా... ఎవరు బాధ్యత వహిస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. లోయర్ కోర్టులో వాయిదాలతో తమకు సంబంధం లేదని తుషార్ మెహతా పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థకు సంబంధం లేకపోతే ఎవరికి ఉంటుందని జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులపై దాఖలైన పిటిషన్లను వేగంగా విచారించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు తెలంగాణ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను ఈ సందర్భంగా జగన్ తరపున న్యాయవాది ముకుల్ రోహత్గీ ప్రస్తావించారు. అందుకని విచారణ ముగించాలని కోరారు. హైకోర్టు సుమోటోగా ఆదేశాలు ఇచ్చినందున మూడు నెలల గడువు ఇవ్వాలని, ఆ తరువాత పరిశీలన జరపాలని వాదించారు. తాము ఈ పిటిషన్లపై విచారణ ముగించడం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. సమయమిచ్చి ఉపయోగం ఏమిటని, ఫలితం ఎక్కడా కనిపించడం లేదని వ్యాఖ్యానించింది. ఇన్ని సార్లు వాయిదాలు పడటం, ఇంత కాలయాపన ఏమిటని అసహనం వ్యక్తం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ మొదటి వారంలో చేపట్టనున్నట్లు తెలిపింది. ఎంపి రఘురామ తరపున న్యాయవాది బాలాజీ శ్రీనివాసన్ వాదనలు వినిపించారు.

రామానాయుడు భూముల అమ్మకాలపై సుప్రీం స్టే

- ప్రభుత్వానికి నోటీసులు

• లోపలి పేజీలో..•

వేమనకు సిఎం జగన్ నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజాకవి యోగి వేమనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో యోగి వేమన చిత్రపటానికి పుష్పాంజలితో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రధాన కార్యదర్శి వి విజయసాయిరెడ్డి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

విచారణకు హాజరుకావాల్సిందే

- రామచంద్ర యాదవ్‌కు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

పలమనేరు ఆర్‌డిఒ ఇచ్చిన నోటీసుల మేరకు ఆయన ఎదుట విచారణకు హాజరుకావాలని భారత చైతన్య యువజన పార్టీ (బిసివైపి) అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్‌ను హైకోర్టు ఆదేశించింది. సిఆర్‌పిసి సెక్షన్ 110 కింద ఆర్‌డిఒ ఇచ్చిన నోటీసును యాదవ్ సవాల్ చేసిన వ్యాజ్యాన్ని శుక్రవారం జస్టిస్ జె సుమతి విచారణ జరిపారు. ఈ నెల 24 వరకు యాదవ్‌పై కఠిన చర్యలు తీసుకోవద్దని ఆర్‌డిఒను ఆదేశించారు. విచారణను 24కు వాయిదా వేశారు. పుంగనూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ యాదవ్ దాఖలు చేసిన మరో పిటిషన్‌పై విచారణ ఈ నెల 25కు వాయిదా వేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

రామానాయుడు భూముల అమ్మకాలపై సుప్రీం స్టే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖ రామానాయుడు స్టూడియో భూములను లేఅవుట్ చేసి విక్రయించడంపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రతివాదులకు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులిచ్చింది. 2003 సెప్టెంబరు 13న ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న అవసరాలకు మినహా ఎలాంటి కార్యకలాపాలకు ఈ భూములను ఉపయోగించకూడదని స్పష్టం చేసింది. కాగా రామానాయుడు స్టూడియోకు 2003లో సినీ అవసరాలకు వినియోగించేందుకు నాటి ప్రభుత్వం 35 ఎకరాల భూమి కేటాయించింది. ఆ భూమిని కోస్టల్ నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ చేసి ఇతర కార్యకలాపాలకు వినియోగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ ఆదేశాలను విశాఖ ఈస్ట్ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హైకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా హైకోర్టు కేసు కొట్టేయడంతో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది.

భూమి ఎందుకు కేటాయించారు? ప్రస్తుతం లేఅవుట్ వేశారా? కార్యకలాపాలు చేపట్టారా? అని పిటిషనర్ న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. విశాఖలో సినీ స్టూడియో నిర్మాణానికి భూములు కేటాయించారని, అందుకు అనుగుణంగా అక్కడ ఎలాంటి పనులు చేపట్ట కుండా లేఅవుట్ వేసి అమ్మకాలకు సిద్ధంగా ఉంచా రని పిటిషనర్ తరపున న్యాయవాది తెలిపారు. దీంతో 2003 సెప్టెంబరు 13న ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న అవసరాలకు మినహా ఎలాంటి కార్యకలాపాలకు ఆ భూములు ఉపయోగించకూడదని ధర్మాసనం ఆదేశించింది. ఈ ఏడాది మార్చి 11లోగా స్పందించాలని రాష్ట్ర ప్రభుత్వా నికి, ఇతర ప్రతివాదులకు నోటీసులు పంపింది.

మోసకారి సంక్షేమాన్ని చూసి మోసపోవద్దు

మొదటిపేజి తరువాయి

రివర్స్‌గేర్‌లో పయనిస్తోందని ఎద్దేవా చేశారు. తిరుపతి జిల్లా వెంకటగిరి వైసిపి ఇన్‌ఛార్జి ఇసుక దోపిడీ, గ్రావెల్ దందా, క్వార్జ్ తవ్వకాలు చేస్తున్నారని ఆరోపించారు. సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లోనూ అదే పరిస్థితి నెలకొందన్నారు. కెజిఎఫ్ త్రీగా ఈ ప్రాంతాన్ని మార్చిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కిందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి మొన్నటి వరకు నాస్తికుడని, ఇప్పుడేమో టిటిడి ఛైర్మన్‌గా వెలగపెడుతున్నారని విమర్శించారు. తిరుపతి, నెల్లూరు ఐటి హబ్‌గా మారుస్తానని హామీ ఇచ్చారు. 16 లక్షల కోట్లు పెట్టుబడులను తాము తెస్తే.. నిరుద్యోగాన్ని సిఎం పెంచిపోషించారని విమర్శించారు.తాము ఐటి ఉద్యోగాలిస్తే వైసిపి ప్రభుత్వంలో వలంటీర్ల ఉద్యోగాలు, బ్రాందీ షాపులో ఉద్యోగాలు, ఫిష్ మార్కెట్ ఉద్యోగాలిచ్చారని ఎద్దేవా చేశారు. తిరుపతిలో రూ. నాలుగు వేల కోట్ల పిడిఆర్ బాండ్ల పేరుతో దోచారని ఆరోపించారు. ప్రజా సంపద, ప్రజలందరి కోసం వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బకాయిల కోసం రోడ్డెక్కిన ఉపాధ్యాయులు

చెవిలో పువ్వులు, నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసనలు



అన్నమయ్య జిల్లా రాయచోటిలో మూతికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-యంత్రాంగం

పిఎఫ్, పిఆర్‌సి, ఇతర ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. చెవిలో పువ్వులు పెట్టుకొని, నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని, మోకాళ్లపై నిలబడి వివిధ రూపాల్లో నిరసన ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నేతలు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి బకాయి ఉన్న సరెండర్ లీవులు, ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఉపాధ్యాయులు నిర్వహించిన మౌన ప్రదర్శనలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెఎ.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ..ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద యుటిఎఫ్ నాయకులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. అనకాపల్లిలో చెవిలో పువ్వులు పెట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అల్లూరి జిల్లా పాడేరు, అడ్డతీగల, చింతూరు కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేశారు. ఏలూరులో నిర్వహించిన ర్యాలీ నిర్వహించారు. నల్లరిబ్బన్లు కళ్లకు కట్టుకుని, మోకాళ్లపై నిల్చొని, కొవ్వొత్తులు చేపట్టి నిరసనలు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో చెవిలో పూవ్వులు పెట్టుకుని, ప్రకాశం చౌక్‌లో మోకాళ్లపై నిలబడి ప్రదర్శనలు చేశారు. నెల్లూరు జిల్లా కావలి, కోవూరు తదితర మండలాల్లో ర్యాలీలు నిర్వహించారు. కడప జిల్లా మైదుకూరు, బద్వేలు, రాజంపేటలో చెవిలో పూలతో, అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మూతికి నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. కర్నూలులో చెవిలో పూలుపెట్టుకుని, తలకు నల్ల రిబ్బన్లు కట్టుకొని ప్రదర్శన చేశారు. విజయనగరం కోట జంక్షన్ నుంచి గంట స్తంభం వరకు ర్యాలీ, పార్వతీపురం మన్యం జిల్లాలో చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. శ్రీకాకుళం, నరసన్నపేటలో చెవిలో పువ్వులు పెట్టుకుని మోకాళ్లపై నిల్చొని నిరసన, టెక్కలిలో ర్యాలీ చేపట్టారు. ప్రకాశం, తిరుపతి, అన్నమయ్య, గుంటూరు, పల్నాడు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు చేశారు.

అనకాపల్లిలో రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం
- కారు టైరు పేలడంతో ప్రమాదం


ప్రమాదానికి గురైన కారు ఇదే..

ప్రజాశక్తి - అనకాపల్లి

అనకాపల్లి జిల్లా శంకరం వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. టైరు పేలి కారు బోల్తా కొట్టిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు ప్రాంతానికి చెందిన ఓ కుటుంబానికి చెందిన ఏడుగురు కారులో దేవాలయాలను దర్శించుకునేందుకు బయలుదేరారు. తొలుత శ్రీకాకుళం, అరసవెల్లి, శ్రీకూర్మం, సింహాచలం దేవాలయాలను సందర్శించారు.

అనంతరం శ్రీ సత్యనారాయణస్వామిని దర్శించుకునేందుకు వెళ్తుండగా అనకాపల్లి మండలం శంకరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై వారు ప్రయాణిస్తున్న కారు టైరు పేలింది. దీంతో సుమారు వంద మీటర్లు రోడ్డు పక్కన రైలింగ్‌ను రాసుకుంటూ వెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న పి.సత్యవతి (48), పి.కుమారి (35)తోపాటు మూడు సంవత్సరాల అభిరాం అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారు క్షేమంగా బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. డిఎస్‌పి సుబ్బరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర సచివాలయంలో ర్యాలీలపై సిఎస్ ఆగ్రహం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర సచివాలయంలో ఉద్యోగులు ర్యాలీలు నిర్వహించడంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సచివాలయంలో ధర్నాలు, ర్యాలీలు వంటివి నిర్వహించరాదన్న నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని ఉద్యోగులు పాటించడం లేదని ఆయన పేర్కొన్నారు. మళ్లీ ఇటువంటివి పునరావృతమైతే సర్వీసు నిబంధనల మేరకు కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఇటీవల జారీ చేసిన సర్క్యులర్ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, సచివాలయంలో ఇకపై ధర్నాలు, ర్యాలీలు వంటివి చేయరాదని ఆయన సర్క్యులర్‌లో స్పష్టం చేశారు. తాజాగా సచివాలయ భద్రతను చూసే స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పిఎఫ్) నుంచి నివేదిక వచ్చిందని అందులో వివరించారు. తరచూ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు మాస్ గేదరింగ్, ర్యాలీలకు దిగుతున్నారని ఎస్‌పిఎఫ్ నుంచి ఫిర్యాదులు అందాయని సిఎస్ వివరించారు. చివరకు సిఎస్ కాన్వాయ్‌కి అడ్డు తగిలే ప్రయత్నాలు, సెక్యూరిటీ సిబ్బందిపై అసభ్యంగా ప్రవర్తించడం వంటివి కూడా చోటుచేసుకుంటున్నట్లు ఎస్‌పిఎఫ్ సిఎస్ దృష్టికి తీసుకువెళ్లింది. ఈ నేపథ్యంలోనే ఇకపై అటువంటి ధర్నాలు, ర్యాలీలు నిర్వహించడం నిషేధిస్తున్నట్లు సిఎస్ తన సర్క్యులర్‌లో స్పష్టంచేస్తూ, అలాంటి ఘటనలు చోటుచేసుకుంటే ఎపి సివిల్ సర్వీస్ నిబంధనలు-1991 మేర చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

జైల్లో మగ్గుతున్న శ్రీనివాస్‌ను విడుదల చేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్
- కుటుంబ సభ్యుల దీక్షకు సంఘీభావం



జంపని శ్రీనివాస్ కుటుంబ సభ్యుల దీక్షకు సంఘీభావం తెలియజేస్తున్న వి శ్రీనివాసరావు, కె రామకృష్ణ తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో అరెస్టయిన జంపని శ్రీనివాస్‌ను వెంటనే విడుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని శ్రీరామ్ ఫంక్షన్ హాల్లో ఆమె తల్లి సావిత్రమ్మ, ఇతర కుటుంబ సభ్యులు.. శ్రీనివాస్‌ను విడుదల చేయాలని చేస్తున్న దీక్షను సందర్శించి శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఐదేళ్ల నుంచి నేరం నిరూపితం కాకుండా దళిత యువకుడిని జైలులో ఉంచి వేధించడం తగదన్నారు. తమ విచారణ పూర్తయిందని ఎన్‌ఐఎ చెప్పిందన్నారు. అయినా కోర్టుకు హాజరై జగన్‌మోహన్‌రెడ్డి సాక్ష్యం చెప్పడం లేదని పేర్కొన్నారు. శ్రీనివాస్ జీవితాన్ని చీకటిమయం చేసి శిక్షించడం న్యాయమా? అని ప్రశ్నించారు. దళితులకు సామాజిక న్యాయం చేస్తున్నామని అంబేద్కర్ విగ్రహావిష్కరణలో జగన్ చెబుతూ బిడ్డ కోసం తల్లి చేస్తున్న దీక్షను కనీసం పట్టించుకోవడం లేదన్నారు. శ్రీనివాస్‌ను జైల్లో వేధించడం తీవ్రమైన చర్యగా భావిస్తున్నామని అన్నారు. తక్షణమే శ్రీనివాస్‌ను భేషరతుగా విడుదల చేయాలని సిపిఎం తరపున డిమాండ్ చేశారు. ప్రభుత్వం దీనిపై స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా మహా ఉద్యమంగా మారుతుందని హెచ్చరించారు. బిడ్డ కోసం తల్లి చేస్తున్న ఆందోళన దీక్షను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తల్లులందరూ బలపరుస్తారని విశ్వసించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, మంతెన సీతారాం పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాల వద్ద సత్యాగ్రహ దీక్షలు


కడపలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు

మొదటిపేజి తరువాయి

పలువురు కార్పొరేటర్లు మద్దతు తెలిపారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో ఆకుల్లో మట్టి వేసుకొని తిన్నారు. అల్లూరి జిల్లాలో పలు మండలాల్లో అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసనలు తెలిపారు. 'అంబేద్కరా.. మా మొర విను' అంటూ అంబేద్కర్ విగ్రహాలకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా వినతిపత్రాలు అందజేశారు. మహిళలకు ప్రత్యేక హక్కులు కల్పించాలని 1951లో తన మంత్రి పదవికి రాజీనామా చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. మహిళా సాధికారత అంటూనే జగన్... అంగన్‌వాడీలను రోడ్డున పడేశారని విమర్శించారు. విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగానైనా ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లాలో అంబేద్కర్ విగ్రహాల వద్ద అంగన్‌వాడీలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఇచ్ఛాపురంలో రాస్తారోకో చేశారు. వైఎస్ఆర్ జిల్లా, అన్నమయ్య జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద మానవహారం నిర్వహించారు. బాడంగి సమ్మె శిబిరంలో పెరుమాళి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ అనురాధ గురువారం స్పృహ తప్పి పడిపోయారు. ఆమెను తోటి అంగన్‌వాడీలు స్థానిక సిహెచ్‌సికి తరలించారు. బొబ్బిలి, సాలూరు, పార్వతీపురంలోని అంగన్‌వాడీల సమ్మె శిబిరాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. తక్షణమే ఎన్నికల హామీలను అమలు చేసి సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు ఎపిటిఎఫ్ నాయకులు రూ.5 వేలు పోరాట నిధి అందజేశారు. కర్నూలు ధర్నా చౌక్‌లో అంగన్‌వాడీలు లెంపలేసుకుని నిరసన వ్యక్తం చేశారు. నంద్యాలలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. గుంటూరులోని చుట్టుగుంట సెంటర్ నుండి సిడిపిఒ కార్యాలయం వరకూ ప్రదర్శన నిర్వహించి అక్కడ బైఠాయించారు. అధికారులు ఇచ్చిన షోకాజు నోటీసులకు సామూహికంగా సమాధానం ఇచ్చారు. మంగళగిరిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి పాల్గొని మద్దతు తెలిపారు. కర్నూలు ధర్నా చౌక్‌లో అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి, చంద్రం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భేషజాలకు పోకుండా అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో అంబేద్కర్ చిత్రపటాలకు, పశ్చిమగోదావరి జిల్లాలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆచంట, పోడూరుల్లో సమ్మె శిబిరాలను సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బలరాం సందర్శించి సంఘీభావం తెలిపారు. పాలకోడేరులో అంగన్‌వాడీలు అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించి రాజ్యాంగ పీఠిక చదివి ప్రతిజ్ఞ చేశారు. ఏలూరులోని కలెక్టరేట్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి 24 గంటల సత్యాగ్రహ దీక్ష ప్రారంభించారు. ముసునూరులో దళితవాడలోని ఉన్న అంబేద్కర్ విగ్రహానికి 16 గ్రామాల అంగన్‌వాడీలు వినతిపత్రం కలిసి అందజేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం ఇచ్చారు. కాకినాడ జిల్లా కేంద్రంలో 24 గంటల రిలే దీక్ష చేపట్టారు. పెద్దాపురం, తాళ్లరేవులో ర్యాలీ, అంబేద్కర్ విగ్రహాల వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టారు.

పలు జిల్లాల్లో అరెస్టులు, గృహనిర్బంధాలు

విజయవాడలోని జరుగుతున్న నిరవధిక నిరాహార దీక్షలకు వెళ్లనీయకుండా పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో సుమారు 30 మంది అంగన్‌వాడీలను, సిఐటియు నాయకులను తెల్లవారుజామున ఆరు గంటలకు పోలీస్ స్టేషన్‌కు తరలించి నిర్బంధించారు. మధ్యాహ్నం తర్వాత వారిని విడుదల చేశారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పలువురు అంగన్‌వాడీలను, సిఐటియు నాయకులను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు. కొంతమందికి నోటీసులు ఇచ్చి ఆయా పరిధిలోని పోలీస్ స్టేషన్లకు తరలించారు. సిఐటియు ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావును గృహ నిర్బంధంలో ఉంచారు. తన భార్యను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అనుమతించాలని కోరినా పోలీసులు అంగీకరించలేదు.


ఉక్కు దీక్షలకు మద్దతు తెలుపుతూ కూర్చున్న ఆర్.నారాయణమూర్తి

'ఉక్కు' ఉద్యమాన్ని ఉధృతం చేయండి

- సినీ నటుడు ఆర్ నారాయణమూర్తి పిలుపు

ప్రజాశక్తి - కూర్మన్నపాలెం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకునేందుకు చేస్తున్న ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని ప్రముఖ సినీ నటుడు ఆర్ నారాయణమూర్తి పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1072వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎంఎంఎస్‌ఎం, ఎస్‌టిఎం విభాగాల ఉద్యోగులు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని నారాయణమూర్తి సందర్శించి మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరణ చేయడానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్ పోరాటాలతో ఏర్పాటైందని, ప్రయివేటుకు అప్పగిస్తే ఊరుకునేది లేదని అన్నారు. ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కార్మికులు చేస్తున్న పోరాటం చారిత్రాత్మకమైందని పేర్కొన్నారు. దీక్షల్లో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ, నాయకులు గుమ్మడి నరేంద్ర, డి దేముడు, రాజేశ్వరరావు, మోహన్ కుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

పౌర హక్కులను కాలరాస్తున్నారు

- సంఘటిత పోరాటాలతో పరిరక్షించుకోవాలి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రంలోని నరేంద్ర మోడీ, రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు కార్మికుల, పౌర హక్కులను కాలరాస్తున్నాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పేర్కొన్నారు. ప్రజలంతా సంఘటితంగా ప్రజా హక్కుల పరిరక్షణకు పూనుకోవాలని కోరారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో సిఐటియు, ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య హక్కులు-పాలకవర్గాల దాడి అనే అంశంపై శుక్రవారం రాష్ట్ర సదస్సు జరిగింది. కార్మిక, కర్షక ఐక్యతా దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ సదస్సులో సిహెచ్ నర్సింగరావు మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులకు వున్న 29 హక్కులను హరించి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని విమర్శించారు. ఈ నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం కార్మికులు, కర్షకులు ఐక్యం కావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తెచ్చిన మూడు నల్లచట్టాలను రద్దు చేయాలని ఢిల్లీలో రైతాంగం చేపట్టిన ఆందోళనలకు కార్మిక వర్గం సంపూర్ణ మద్దతును ఇచ్చిందని తెలిపారు. కార్మికులు, కర్షకులు ఐక్యం కావడం ద్వారానే దేశంలో పౌరహక్కులకు రక్షణ వుంటుందని ఢిల్లీ రైతాంగ ఉద్యమం నిరూపించిందన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. 1982లో కార్మికులు, కర్షకుల హక్కుల కోసం చేపట్టిన సమ్మెపై పోలీసులు నిర్బంధం ప్రయోగించి కాల్పులు జరపడంతో ఏడుగురు అమరులయ్యారని అన్నారు. నాటి నుంచి దేశంలో కార్మిక, కర్షకుల ఐక్యత మరింత పటిష్టంగా సాగుతుందని తెలిపారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న జాతీయ స్థాయిలో కార్మిక సమ్మె, గ్రామ హర్తాళ్‌ను నిర్వహించేందుకు కార్మిక, రైతు సంఘాలు పిలుపునిచ్చాయని తెలిపారు. వీటిని జయప్రదం చేయాలని కోరారు. ఈ సదస్సులో ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు అజయ్‌కుమార్, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోట కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వదలి వెళ్లొద్దు

- అన్నమయ్య జిల్లా కలెక్టరుకు సిఎస్ ఆదేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా కలెక్టరు గిరీషాను సస్పెండ్ చేస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులిచ్చారు. సస్పెన్షన్ కాలంలో విజయవాడను వదిలి వెళ్లొద్దని ఆదేశించారు. ఓటరు కార్డుల డౌన్‌లోడ్ వ్యవహారంలో తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో అప్పటి ఆర్‌ఒగా గిరీషా వ్యవహరించారు. రిటర్నింగ్ అధికారిగా ఆయన లాగిన్ దుర్వినియోగపరిచారని అభియోగం నమోదైంది. ఎన్నికలకు సంబంధించి మరో ఐఎఎస్, ఐపిఎస్‌పై కూడా ఇసి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

చంద్రబాబు 'స్కిల్' కేసులో సిఐడి పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంటు కేసులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు హైకోర్టు బెయిల్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఎపి సిఐడి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఫిబ్రవరి 12కి వాయిదా పడింది. సిఐడి పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఇటీవల స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం ఇవ్వాలని చంద్రబాబు తరపున న్యాయవాదులు గుంటూరు ప్రమోద్, ప్రేరణ కోరారు. ఎపి సిఐడి తరపున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. చంద్రబాబు తరపున న్యాయవాదులు విజ్ఞప్తి మేరకు ఫిబ్రవరి 12కి విచారణ వాయిదా వేసింది. అంతలోపు కేసుకు సంబంధించిన అంశాలు లిఖిత పూర్వకంగా సమర్పించాలని సూచించింది.

పత్తికొండలో కాల్పుల కలకలం

- పార్కింగ్ విషయంలో లారీ డ్రైవర్ల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి - పత్తికొండ (కర్నూలు)

కర్నూలు జిల్లా పత్తికొండలో శుక్రవారం కాల్పుల కలకలం రేగింది. పార్కింగ్ విషయంలో ఇద్దరు లారీ డ్రైవర్ల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో మాజీ సైనికుడైన లారీ డ్రైవర్ తన వద్ద ఉన్న తుపాకీతో కాల్పులు జరిపారు. పోలీసుల కథనం ప్రకారం...కర్ణాటక నుంచి చెన్నైకు గ్రానైట్ తీసుకెళ్తున్న లారీ డ్రైవర్ శ్రవణ్ కుమార్, ఉల్లిపాయల లారీని గుజరాత్ నుంచి తమిళనాడు తీసుకువెళ్తున్న మాజీ సైనికుడు వెంకటేషన్... ఇరువురూ పత్తికొండ నుంచి ఆదోనికి వెళ్లే బైపాస్ రోడ్‌లో ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ సమీపంలో పంక్చర్ షాప్ గ్యారేజ్ దగ్గర లారీలను ఆపారు. పార్కింగ్ విషయంలో ఇద్దరు డ్రైవర్ల మధ్య ఘర్షణ జరిగింది. మాజీ సైనికుడి తలపై శ్రవణ్‌కుమార్ దాడి చేశాడు. దీంతో తన వద్ద ఉన్న లైసెన్స్ తుపాకీతో మాజీ సైనికుడు ఒక రౌండ్ గాలిలోకి కాల్పులు జరిపారు. పంక్చర్ షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఘటనాస్థలికి చేరుకున్నారు. గాయపడిన వెంకటేషన్‌ను పత్తికొండ ప్రభుత్వ ఆస్పత్రికి పోలీసులు తరలించారు. శ్రవణ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, తుపాకీని స్వాధీనం చేసుకున్నామని పత్తికొండ సిఐ మురళీమోహన్ తెలిపారు.

'స్టార్' రేటింగ్‌తోనే కొత్త పంపుసెట్లు

మొదటిపేజి తరువాయి

వివరించింది. అలాగే కొత్త పంపుసెట్ల మార్పుకోసం అయ్యే వ్యయం 17.5 కోట్లు ఉంటుందని తన సర్క్యులర్‌లో వివరించింది. అన్ని ప్రభుత్వ శాఖల్లో పాత పంపుసెట్లను ఇంకా ఉపయోగిస్తున్నారని, ప్రధానంగా మున్సిపాల్టీ, పంచాయతీరాజ్‌శాఖలో మరింత ఎక్కువగా ఈ సమస్య ఉందని ఇంధన శాఖ గుర్తించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు 90 వేల ప్రభుత్వ భవనాల్లో పాత తరహా పంపుసెట్లనే వినియోగిస్తున్నట్లు వివరించింది.

విధేయతకు విలువలేదు

- తిరువూరు వైసిపి ఎమ్మెల్యే రక్షణనిధి ఆవేదన

ప్రజాశక్తి - తోట్లవల్లూరు (కృష్ణాజిల్లా)



వైసిపి అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్ద విధేయతకు విలువలేదని, పైరవీలకు మాత్రమే పెద్దపీట వేస్తారని తిరువూరు వైసిపి ఎమ్మెల్యే రక్షణ నిధి అన్నారు. వైసిపి తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా టిడిపి నుంచి వచ్చిన నల్లగట్ల స్వామిదాసును నియమించడంపై ఆయన ఆవేదన చెందారు. కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెం గ్రామంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరువూరు నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను తప్పించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

నమ్మించి గొంతు కోసినట్లు సిఎం జగన్ వైఖరి ఉందని వాపోయారు. రెండు పర్యాయాలు తిరువూరు ఎమ్మెల్యేగా గెలిచిన తనను జగన్‌మోహన్ రెడ్డి మోసం చేశారని విమర్శించారు. ఇటీవల ఐ ప్యాక్ నిర్వహించిన సర్వేలోనూ ఎన్‌టిఆర్ జిల్లాలో గెలిచే అభ్యర్థుల్లో తాను ప్రథమ స్థానంలో ఉన్నట్లు తేలిందన్నారు. మోసపూరితమైన జగన్ పరిపాలనలో మనస్సాక్షిని చంపుకుని ఇమడలేనని స్పష్టం చేశారు. టిడిపి టికెట్‌తో వచ్చినా ఎమ్మెల్యేగా తనను గెలిపించుకుంటామని నియోజకవర్గ ప్రజలు అంటున్నారని తెలిపారు. తన రాజకీయ సహచరులు, కార్యకర్తల అభీష్టం మేరకు భవిష్యత్తు కార్యాచరణను త్వరలో ప్రకటిస్తానని చెప్పారు.

గంగావతి బహిష్కరణ

- ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జె గంగావతిని సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఆర్ జ్యోతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో లక్షలాది మంది అంగన్‌వాడీలు సంఘటితంగా సమ్మె చేస్తుంటే.. అంగన్‌వాడీల ఐక్యతను విచ్ఛిన్నం చేసేలా గంగావతి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఉద్యమ ద్రోహానికి పాల్పడ్డ గంగావతిని రాష్ట్ర అధ్యక్ష పదవితోపాటు సంఘం ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దయ్యే వరకూ పోరు

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో ప్రజలకు తీవ్ర నష్టమని, ఆ చట్టం రద్దయ్యేంత వరకూ పోరాడతామని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. 'భూ హక్కుల చట్టం- రైతులకు నష్టకరం' అనే అంశంపై శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తెనాలిలోని చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యవక్తగా కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఓ వైపు భూముల రీ సర్వే అని చెబుతుందని.. అది పూర్తికాక ముందే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తీసుకువచ్చిందని, ప్రపంచంలో ఉన్న పెట్టుబడిదారులకు వారు కోరుకున్న రీతిలో భూములను కట్టబెట్టేందుకు ఈ చట్టం తీసుకువచ్చారని విమర్శించారు. ఎవరు అధికారంలో ఉంటే వారి కబంధహస్తాల్లో భూమి హక్కు ఉండేలా తెచ్చిన చట్టంతో వారసత్వంగా ప్రజలకు వస్తున్న భూములపై హక్కును కోల్పేయే ప్రమాదం ఉందని, చట్టంలో అనేక లొసుగులు ఉన్నాయని వివరించారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలోని ట్రిబ్యునల్‌కు కట్టబెట్టడం, తీర్పును హైకోర్టులో మినహా మరే కోర్టులోనూ సవాల్ చేసే అధికారం లేకుండా చేయడం సామాన్యుల హక్కులను కాలరాయడమేనన్నారు. ఈ యాక్ట్ రద్దుకు రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు చేస్తున్న ఆందోళనలకు రైతు సంఘం అండగా నిలుస్తోందని ప్రకటించారు. తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు మందలపు వేణుగోపాల్ మాట్లాడుతూ.. భూ సంబంధిత వివాదాలను ట్రిబ్యునల్ ద్వారా రెండేళ్ల కాలపరిమితిలో పరిష్కరిస్తామని చెబుతున్నారని, అదెలా సాధ్యమని ప్రశ్నించారు. కోర్టులో దీర్ఘకాలికంగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం చెబుతోందని, అయితే కోర్టుల సామర్థ్యానికి తగిన రీతిలో న్యాయమూర్తులు లేరనే విషయాన్ని కూడా ప్రభుత్వం గమనించాలని సూచించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎం.శివసాంబిరెడ్డి, తెలుగు రైతు నాయకులు ఈదర పూర్ణచంద్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ చందు సాంబశివుడు ప్రసంగించారు. సీనియర్ న్యాయవాది ఎన్‌వి మహేశ్వరరావు, కెవి సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, కె.పూర్ణచంద్రరావు, వై.బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ

విద్యార్థుల యూనిఫాంకు చేనేత వస్త్రాలు

- ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం డిమాండ్
- రాష్ట్ర అధ్యక్షులుగా కట్ట శివదుర్గారావు ఎన్నిక

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంగా చేనేత వస్త్రాలను ఇవ్వాలని, సహకార సంఘాలకు బకాయి ఉన్న యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ, త్రిఫ్ట ఫండ్, రిబేట్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ డిమాండ్ చేశారు. చేనేత రంగానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.ఐదు వేల కోట్లు, రాష్ట్ర బడ్జెట్‌లో రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని కోరారు. సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం శుక్రవారం గుంటూరు జిల్లా మంగళగిరిలోని సుందరయ్య నగర్‌లో సింహాద్రి శివారెడ్డి భవనంలో జరిగింది. సమావేశానికి రాష్ట్ర నాయకులు కె.శివదుర్గారావు అధ్యక్షతన వహించగా చేతివృత్తిదారుల రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య మాట్లాడారు. సమావేశం నిర్ణయాలను మీడియాకు బాలకృష్ణ వెల్లడించారు.

మగ్గాల షెడ్డుల్లో చేనేత కార్మికులకు 'నేతన్న నేస్తం' పథకాన్ని వర్తింపజేయాలని, చేనేతపై జిఎస్‌టిని రద్దు చేయాలని, పట్టు, జరీ, నూలు ధరలను 2021 నాటి స్థాయికి తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చేనేత పార్కులు ఏర్పాటు చేయాలని, చేనేతకు కేటాయించిన 11 రకాల చేనేత వస్త్రాలు పవర్ లూమ్‌లపై తయారీ కాకుండా చూడాలని, ఉల్లంఘించిన పవర్ లూమ్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలను సమావేశం ఆమోదించినట్లు వివరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కట్ట శివదుర్గారావును ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.రామారావు, సహాయ కార్యదర్శి వి.గంగాధరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.చంద్రకళ, జి.రాజు, ఎ.వీరబ్రహ్మం, పి.ఆదిశేషు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న శ్యామలరావు

22న తుది ఓటరు జాబితా ప్రకటన

- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈ నెల 22న ఓటరు తుది జాబితా ప్రచురణకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఎలక్షన్ రోల్ అబ్జర్వర్, ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు ఆదేశించారు. పార్వతీపుం మన్యం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన కలెక్టర్ కార్యాలయంలో ఓటరు నమోదు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా శ్యామలరావు మాట్లాడుతూ.. తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయాలని, అనవసరపు ఫిర్యాదులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో తప్పుల్లేని ఓటరు జాబితా విడుదలకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేశామని తెలిపారు. జిల్లాలో 1031 పోలింగ్ కేంద్రాలు 768 లోకేషన్లలో ఉన్నాయని, అందులో గ్రామీణ ప్రాంతాల్లో 719 లోకేషన్లలో 933 పోలింగ్ కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో 49 లోకేషన్లలో 98 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. 24 కేంద్రాల్లో విద్యుత్, 62 కేంద్రాల్లో ర్యాంపులు, 44 కేంద్రాల్లో మరుగుదొడ్లు, 38 కేంద్రాల్లో తాగునీరు అవసరమని గుర్తించామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటిడిఎ పిఒలు కల్పనాకుమారి, సి.విష్ణు చరణ్, డిఆర్‌ఒ జె.వెంకట రావు, పాలకొండ ఆర్‌డిఒ ఎం.లావణ్య, పార్వతీపురం తహశీల్దార్ శివన్నారాయణ హాజరయ్యారు.


సిఎస్ దంపతులకు తీర్థప్రసాదాలను అందిస్తున్న ఆలయ అధికారులు

శ్రీవారిని దర్శించుకున్న సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుమల

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి దంపతులు శుక్రవారం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి అభిషేక సేవలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వారిని వేదాశీర్వచనం అందించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు, డైరీ, కేలండర్‌ను జెఇఒ వీరబ్రహ్మం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ హరీంద్రనాథ్, విజిఒ గిరిధర్‌రావు, రిసెప్షన్ ఒఎస్‌డి రామకష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని కెఎస్.జవహర్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు.

జూనియర్ లైన్‌మెన్ల మహాధర్నా

- డిస్కం వద్ద భారీగా పోలీసులు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ


డిస్కం కార్యాలయం ఎదుట లైన్‌మెన్ల ధర్నా

గ్రేడ్2 లైన్‌మెన్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో యుఇఇయు, యుఇసిడబ్ల్యుయు మద్దతుతో శుక్రవారం మహాధర్నా చేపట్టారు. తిరుపతిలోని ఎస్‌పిడిసిఎల్ ప్రధాన కార్యాలయం వద్ద నాలుగు జిల్లాలకు చెందిన గ్రేడ్2 లైన్‌మెన్లు వందలాదిమంది హాజరై నడిరోడ్డుపై మండుటెండలో బైఠాయించి తమకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. కార్మికులు మహాధర్నా చేపడతారని ముందుగానే తెలుసుకున్న యాజమాన్యం వందలాది మంది పోలీసులను డిస్కం కార్యాలయం, ఎస్ఇ కార్యాలయం వద్ద మోహరింపజేసి, కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, రోప్‌వేలు కట్టి, కట్టుదిట్టమైన భద్రతతో పహారా కాసింది. వివిధ జిల్లాల నుంచి తిరుపతికి చేరుకున్న కార్మికులు శ్రీనివాస కల్యాణమండపాల నుంచి ర్యాలీగా డిస్కం ప్రధాన కార్యాలయం వద్దకు చేరుకుని, రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా మహాధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళీ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ సంస్థ నోటిఫికేషన్ ద్వారా గ్రేడ్ 2 పోస్టులు భర్తీ చేశారేగాని విద్యుత్తుశాఖ ఉద్యోగులుగా గుర్తించడం లేదని అన్నారు. ఎలక్ట్రిసిటీ ఉద్యోగులకు వర్తింపజేసే అన్ని సదుపాయాలు గ్రేడ్ 2 లైన్‌మెన్లకూ వర్తింపజేయాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చే స్కేల్ ప్రకారమే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంబానీ, అదానీ జేబులు నింపేందుకే ఎలక్ట్రిసిటి రంగం ప్రస్తుతం అప్పుల్లో ఉందని చెబుతున్నారని విమర్శించారు. యుఇఇయు రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు, ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులరైజేషన్ చేయాలని, తెలంగాణ తరహాలో సంస్థలో విలీనం చేసి డైరెక్ట్ పేమెంట్ కల్పించాలని డిమాండ్ చేశారు. యుఇఇయు నాయకులు పెంచల్ ప్రసాద్, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాల సుబ్రమణ్యం, డిస్కం అధ్యక్షులు శివశంకర్ నాయకత్వం వహించారు.



దర్శకుడు త్రివిక్రమ్ బొమ్మను దహనం చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

మహనీయుల పేర్ల దుర్వినియోగాన్ని సహించం

- డివైఎఫ్ఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో త్రివిక్రమ్ శ్రీనివాస్ దిష్టిబొమ్మ దగ్ధం

ప్రజాశక్తి - కడప అర్బన్, ఒంగోలు

గుంటూరు కారం సినిమాలోని మహనీయుల పేర్లు విలన్లకుపెట్టిఅవమానించడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం డివైఎఫ్ఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కడప, ఒంగోలులో చిత్ర దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వైఎస్‌ఆర్ జిల్లా కడపలోని పూలే సర్కిల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ మాట్లాడుతూ ప్రపంచ మేధావులైన కారల్ మార్క్స్, లెనిన్ పేర్లను అవమానిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రపంచ గతిని మార్చిన గొప్ప చరిత్ర నిర్మాత కారల్ మార్క్స్ అని కొనియాడారు. దోపిడి పీడనపై చిరు ప్రాయంలోనే ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గ రాజ్య స్థాపనకై త్యాగాలు చేశారని పేర్కొన్నారు. దోపిడీదారుల సింహ స్వప్నం కారల్ మార్క్స్ అని తెలిపారు. కార్మిక దిక్సూచి మార్క్స్ సిద్ధాంతాన్ని ఆచరణాలు పెట్టి 1917లో రష్యా విప్లవం సాధించి కార్మిక వర్గ రాజ్యాన్ని స్థాపించి అతి తక్కువ కాలంలోనే ప్రపంచంలోనే వేగవంతంగా మానవ అభివృద్ధి జరిగినటువంటి దేశం సోవియట్ రష్యా అన్నారు. రష్యా సహకారంతో భారతదేశంలో పారిశ్రామిక రంగంలో పురోగామి సాధించిందని చెప్పారు. ఇటువంటి చరిత్రకారులను విలన్లగా చూపించి, డబ్బు సంపాదన పరమావధిగా చరిత్రను వక్రీకరించి ప్రజలను త్రివిక్రమ్ పక్కదారి పట్టించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి దస్తగిరి రెడ్డి, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డిఎం ఓబులేసు, నాయకులు పవన్, ఉదయ్, మాజీ డివైఎఫ్ఐ నాయకుడు వెంకటేష్ పాల్గొన్నారు. ఒంగోలోని రంగారాయుడు చెరువు సెంటర్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కార్యక్రమానికి ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్ అధ్యక్షత వహించారు.

భారత్‌లో వేగంగా విమానయానవృద్ధి

- బోయింగ్ ప్రతినిధి వెల్లడి

హైదరాబాద్ : భారత్‌తో విమానయాన రంగం వేగంగా వృద్ధి చెందుతోందని బోయింగ్ కమర్షియల్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ డారెల్ హాల్స్ అన్నారు. హైదరాబాద్‌లోని బేగంపేట్‌లో జరుగుతున్న వింగ్స్ ఇండియా ప్రదర్శన రెండో రోజుకు చేరింది. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డారెల్ మాట్లాడుతూ.. కరోనా ముందు స్థాయి కంటే ఎక్కువగా భారత్‌లో విమానయానం పెరిగిందన్నారు. 2023లో నెలవారీ విమానయాన ప్రయాణికుల సంఖ్య 2019లో ఉన్న దానికంటే ఏడు శాతం ఎక్కువగా ఉందన్నారు. అంతర్జాతీయ ట్రాఫిక్‌లో 30 శాతం వృద్ధితో అగ్రస్థానంలో ఉందన్నారు. దక్షిణాసియాకు 2042 నాటికి 2,705 కొత్త విమానాలు అవసరమవుతాయని.. అందులో 92 శాతం భారత్‌కు కావాల్సి ఉంటుందని డారెల్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 2000 విమానాల డెలివరీలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాబోయే 20 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా 42,592 కొత్త విమానాలు అవసరం. "ప్రపంచ స్థాయిలతో పోలిస్తే భారత్‌లో అధిక విమాన ఇంధన పన్నులు రూపంలో కొన్ని సవాళ్లు నెలకొని ఉన్నాయి. అధిక పోటీ ఈ రంగంపై ప్రభావం చూపుతుంది." అని బోయింగ్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ కమర్షియల్ మార్కెటింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ నాయుడు పేర్కొన్నారు. అలాగే వచ్చే రెండు దశాబ్దాల్లో 2,700 విమానాలు అవసరమవుతాయని బోయింగ్ కమర్షియల్ మార్కెట్ అవుట్‌లుక్ (సిఎంఒ)లో అంచనా వేసింది. ప్యాసింజర్ ఎయిర్‌లైన్స్ డిమాండ్‌ను చేరడానికి 37,000 మంది పైలట్లు, 38వేల మెయింటనెన్స్ టెక్నీషియన్స్ కావాల్సి ఉంటుందని తెలిపింది.

సంపాదకీయం

ఆర్థిక చక్రబంధం

సహకార ఫెడరలిజం పాటిస్తామని 2014 ఎన్నికల ప్రణాళికలో గొప్పగా చెప్పి అధికారానికొచ్చిన మోడీ సర్కారు ఆచరణలో అందుకు భిన్నంగా రాష్ట్రాల ఆర్థిక వనరులను, అధికారాలనూ క్రమంగా గుంజుకుపోవడం దారుణం. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధాని నరేంద్ర మోడీ పన్నుల్లో రాష్ట్రాల వాటాను తగ్గించేందుకు ప్రయత్నించారంటూ అల్ జజీరా ప్రచురించిన తాజా కథనం ఈ సర్కారుది ఆదినుండీ అదే తీరని నిర్ధారించింది. ఇందుకోసం ప్రధాని కేంద్ర ఆర్థిక సంఘాన్ని రహస్యంగా సంప్రదించగా దాని అధిపతి వైవి రెడ్డి వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారని పేర్కొంది. 'కేంద్ర పన్నుల్లో అధిక వాటా పొందాలన్న ప్రయత్నం బెడిసికొట్టడంతో బడ్జెట్‌లో సంక్షేమ కార్యక్రమాలకు నిధుల కేటాయింపును కుదించింది' అని వివరించింది. పన్నుల్లో రాష్ట్రాల వాటాను 32శాతం నుంచి 42శాతానికి పెంచాలని సూచిస్తూ ఆర్థిక సంఘం 2014 డిసెంబర్‌లో నివేదికను సమర్పించింది. మోడీ ప్రభుత్వం పన్నుల్లో రాష్ట్రాల వాటాను 33శాతానికి పరిమితం చేయాలని భావించి అందుకోసం ప్రయత్నించింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి ఆర్థిక సంఘం సిఫార్సులను ఆమోదించడం లేదా వాటిని తిరస్కరించి కొత్తగా ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయడం అనే రెండు ప్రత్యామ్నాయాలే ఉంటాయి. అంతే తప్ప వాటిపై వాదించడం, చర్చించడం లేదా సంప్రదింపులు జరపడం వంటివి చేయరాదు. ప్రధాని మోడీ ఆర్థిక సంఘం ఛైర్మన్ వైవి రెడ్డిని రహస్యంగా సంప్రదించడం రాజ్యాంగ నియమాలను ఉల్లంఘించడమే అవుతుంది. ఇదీ సహకార ఫెడరలిజం!

రాష్ట్రాలకు రావలసిన పన్నుల వాటాను (షేర్) కుదించడానికి సర్వవిధాలా ప్రయత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వం వసూలైన పన్నుల్లో చట్టప్రకారం ఇవ్వాల్సిన సొమ్ము (కాంపెన్సేషన్) కూడా రాష్ట్ర ప్రభుత్వాలకు సకాలంలో చెల్లించడంలేదు. కోవిడ్ సమయంలో సైతం జిఎస్‌టి వాటాను రాష్ట్రాలకు చెల్లించకపోవడం బిజెపి పాలిత రాష్ట్రాలతోసహా అందరూ గొంతెత్తడంతో మొదట అప్పులు చేసుకోవడానికి అనుమతినిస్తామనడం, ఆ తరువాత కొద్ది మొత్తాలను మంజూరు చేసిన అమానుష చరిత్ర ఈ ప్రభుత్వానిది. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు పన్ను వాటా చెల్లించకపోవడమేగాక విపత్తు సహాయ నిధులను బిగపట్టడంతోపాటు రుణ పరిమితులపై తీవ్ర ఆంక్షలు విధించి చక్రబంధంలో బిగిస్తోంది. ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలోనే ప్రభుత్వ వ్యయం ఎక్కువగా ఉంటుంది. ఇటువంటి కీలక సమయంలో కేరళను ఆర్థిక దిగ్బంధనానికి కేంద్రం పూనుకోవడం దుర్బుద్ధి మాత్రమే! కేంద్రం నుండి వివిధ రూపాల్లో బకాయిలు రూ. 57 వేల కోట్లు రావలసివుండగా డిసెంబర్ చివరి వారంలో కేవలం రూ.1,404 కోట్లు మాత్రమే విడుదల చేయడం కక్షపూరిత వైఖరికి నిదర్శనం. తాను ఇవ్వాల్సిన నిధులివ్వని కేంద్ర ప్రభుత్వం కేరళ సర్కారు అప్పు చెయ్యడానికి కూడా రుణ పరిమితి అనుమతించదని మోకాలడ్డడం దుర్మార్గం. విధానపరంగా బిజెపిని అన్ని రంగాల్లో వ్యతిరేకించడమేగాక ప్రత్యామ్నాయాలను చూపడం మూలంగానే ఎల్‌డిఎఫ్ సర్కారుపట్ల కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. అందుకు వ్యతిరేకంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితోసహా మంత్రివర్గం దేశ రాజధానిలో ఫిబ్రవరి 8న ధర్నా చేయాలని నిర్ణయించారు. ఆర్థిక దిగ్బంధనాన్ని గురించి ఆ రాష్ట్ర ప్రజలకు వివరించి, అన్ని పార్టీల మద్దతును కూడా కోరారు. ఇది కేవలం కేరళ సమస్య మాత్రమే చూడరాదు. రాష్ట్రాల హక్కుల సమస్యగా, ఫెడరల్ స్ఫూర్తికి విఘాతంగా ప్రతి భారతీయుడూ భావించాలి.

భారత రాజ్యాంగ మూలస్తంభాల్లో ఫెడరలిజం ముఖ్యమైనది. 'ఇండియా అంటే భారత్–రాష్ట్రాల సమాహారం' అని రాజ్యాంగ పీఠిక పేర్కొంది. రాష్ట్రాలతోనే కేంద్రం ఏర్పడింది కనుక రాష్ట్రాలు పరిపుష్టంగా ఉంటేనే బలమైన భారత దేశం సాధ్యం. కానీ బిజెపి సర్కారు రాష్ట్రాలను నామావశిష్టం చేసి అన్ని వనరులను, అధికారాలనూ కేంద్ర ప్రభుత్వం వద్దనే కేంద్రీకరించడం రాజ్యాంగ విరుద్ధం. 'ఒకే దేశం–ఒకే చట్టం, ఒకే దేశం–ఒకే భాష, ఒకే దేశం–ఒకే ఎన్నికలు...' ఇలా కేంద్రీకృతం చేసేందుకు పూనుకుంటోంది. ఈ దుర్విధానాలను ఐక్యంగా విశాల ప్రజా ఉద్యమాల ద్వారా ప్రతిఘటించాలి. ఆ సర్కారును గద్దె దించాలి.

మహనీయుల మాట




చదువు మనిషిని
పూర్తి మానవుడిగా తీర్చిదిద్దుతుంది.
చర్చ సంసిద్ధ మానవుడిగా
తీర్చిదిద్దుతుంది.
రాత కచ్చితమైన
మానవునిగా తీర్చిదిద్దుతుంది.
- ఫ్రాన్సిస్ బేకన్,
బ్రిటిష్ రాజనీతిజ్ఞుడు.

కార్మిక, కర్షక మైత్రి నిర్మాత లెనిన్



కార్మిక కర్షక మైత్రి అనే మౌలిక సూత్రంపై ఆధారపడే లెనిన్, బోల్షివిక్ పార్టీ అనేక విధానపరమైన నిర్ణయాలను...అక్టోబరు విప్లవం జయప్రదం కాకముందు, తర్వాత కూడా తీసుకున్నారు. రష్యన్ విప్లవం ప్రధాన నినాదం 'శాంతి, భూమి, తిండి' ఈ ఐక్యతనే ప్రతిఫలిస్తోంది. "కార్మికుల, రైతుల, సైనికుల ప్రతినిధులు ఎన్నికైన సోవియట్‌లలో ఒకరికొకరు దగ్గరయ్యారు. రైతాంగంపై తమ నాయకత్వ స్థానాన్ని నిలుపుకోగలిగిన స్థాయిలో కార్మిక వర్గం ఉండాలి. ఆర్థిక వ్యవస్థలో అనవసర దుబారా ఖర్చుల్ని తొలగించడం ద్వారా అది రైతాంగ విశ్వాసాన్ని పొందగలిగి వుండాలి. ఆ విధమైన సామాజిక సంబంధాలు ఆర్థిక వ్యవస్థలో ఉండాలి".

సందర్భం



అశోక్ ధావలే

కార్మికవర్గ విముక్తి పోరాటం ఉత్పత్తి చేసిన సిద్ధాంతవేత్తల్లో లెనిన్ మార్క్స్‌కు సరిసమానమైన వ్యక్తి అని వర్గచైతన్యంపైనా, చరిత్ర పైనా అధ్యయనం చేసిన రచయిత, హంగేరికి చెందిన మార్క్సిస్టు జార్జి లూకాక్స్ అంటాడు. ఏ లెనిన్ శత వర్ధంతిని నేడు మనం జరుపుకుంటున్నామో అది సిద్ధాంతం, ఆచరణల, అలాగే ఉద్యమాలు, నిర్మాణం యొక్క ప్రత్యేక కలయిక. మొట్టమొదటి సోషలిస్టు విప్లవానికి నాయకత్వం వహించడం ఆయన సాధించిన అతి పెద్ద విజయం. అన్ని ప్రతికూల పరిస్థితుల్లో దాన్ని కాపాడుకోవడానికి అవసరమైన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం చేయడం ఆయన ప్రత్యేకత. మార్క్సిజానికి ఆయన చేసిన ప్రభావవంతమైన సైద్ధాంతిక సహకారాల్లో ఒక ముఖ్యమైనది సోషలిస్టు విప్లవానికి కార్మిక కర్షక మైత్రికి సంబంధించినది. విషయాన్ని ఆయన సైద్ధాంతికంగా ప్రతిపాదించడమే కాదు, రష్యాలో జరిగిన అక్టోబర్ విప్లవంలో దాన్ని ఆచరణలో పెట్టాడు. సోషలిస్టు వ్యవస్థ నిర్మాణంలో దాన్ని అంతర్భాగమే చేశాడు.

ఆ భావనకు అంకురార్పణ

మార్క్స్, ఏంగెల్స్ తమ రచనల్లో నాటి పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాలకు చెందిన కార్మిక వర్గం పైనే తమ దృష్టిని కేంద్రీకరించారు. పెట్టుబడిదారీ విధానం నుండి సోషలిజంలోకి పరివర్తన జరిగే క్రమంలో కార్మిక వర్గం అందుకు అవసరమైన నాయకత్వాన్ని అందించగలదని వారిరువురూ పేర్కొన్నారు. ఏమైనా రైతాంగంలోని వివిధ తరగతులు ఆ విప్లవంలో పోషించే సానుకూల, ప్రతికూల అంశాలను కూడా వారు పరిగణనలోని తీసుకున్నారు. 1871లో జరిగిన వీరోచిత ప్యారిస్ కమ్యూన్‌ను ఓడించడంలో రైతాంగం ఫ్రెంచ్ బూర్జువా వర్గానికి ఏ విధంగా సహకరించిందో ఆయన పరిగణనలోకి తీసుకున్నాడు. పెట్టుబడిదారుల ఆస్తులతో పాటు రైతాంగం ఆస్తులపై కూడా కార్మిక వర్గం దాడి చేస్తుందన్న భయం రైతాంగం పెట్టుబడిదారులకు సాయపడేలా చేసింది. ఏమైనా, మార్క్స్ ఏంగెల్స్‌లకు రైతాంగ శక్తిపై అవగాహన ఉంది. ఏప్రిల్ 16, 1856లో మార్క్స్ ఏంగెల్స్‌కి రాసిన లేఖలో కార్మికవర్గ విప్లవానికి రైతాంగం కలిస్తే అద్భుతాలు జరుగుతాయన్నాడు. ఈ విషయాన్ని లెనిన్ సీరియస్‌గా తీసుకున్నాడు. 'మన విప్లవం' పేరున ఆయన జీవిత చరమాంకంలో (1923, మే 30న) ప్రావ్దా ప్రచురించిన వ్యాసంలో ఈ విషయాన్ని నొక్కి వక్కాణించాయి.

26 ఏళ్ల పిన్న వయసులో "రష్యాలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి" అనే గ్రంథం 1896లో లెనిన్ రాశాడు. దాన్లో కార్మికవర్గ, రైతాంగ విప్లవకర శక్తి గురించి రాశాడు. "కార్మికవర్గ పార్టీ, రైతాంగం" అనే వ్యాసం 1901లోనే ఆయన రాశాడు. "కార్మికవర్గ పోరాటాల విప్లవ లక్ష్యం కోట్లాది రైతాంగంలో విప్లవ చైతన్యాన్ని రేకెత్తించకుండా సాధ్యం కాదని పేర్కొన్నాడు. ఇది సాధ్యం కాదని ఏ ఒక్కరూ చెప్పకండి! మన కు తెలియకుండానే, మన ప్రమేయం లేకుండానే వేలాది పద్ధతుల్లో ఇది జరిగిపోతూనే ఉంది. 1903లో "గ్రామీణ పేదల కోసం" అనే గ్రంథంలో ఈ ఆలోచనను మరింత విస్తృత పరిచాడు. ఇది ఇప్పటికీ తన ప్రాసంగితను నిలుపుకుంటూనే ఉంది.

కార్మిక కర్షక మైత్రి ద్వంద్వ లక్ష్యాలు

1905లో జరిగిన మొదటి రష్యా విప్లవాన్ని జార్ ప్రభుత్వం రక్తపుటేరుల్లో ముంచేసినా, అది ఎన్నో విలువైన పాఠాలను అందించింది. అప్పుడే బోల్షివిక్ పార్టీ 'కార్మిక వర్గ, రైతాంగ విప్లవకర ప్రజాతంత్ర నియంతృత్వం' అని ఒక నినాదమిచ్చింది. ఇది మార్క్సిజాన్ని మరింత సంపద్వంతం చేసింది. నిర్దిష్ట పరిస్థితుల్ని నిర్దిష్టంగా విశ్లేషించడం ప్రాతిపదికన లెనిన్ ప్రతిపాదించిన సిద్ధాంతం ఈ విధంగా ఉంది. పెట్టుబడిదారీ విధానం మొదట ప్రారంభమైన దేశాలకీ, తర్వాత ఆలస్యంగా ప్రారంభమైన దేశాలకీ చాలా తేడా ఉంది. 1789లో ఫ్రెంచ్ బూర్జువా వర్గ నాయకత్వాన జరిగిన ఫ్రెంచ్ విప్లవం, భూస్వామ్య విధానాన్ని ధ్వంసం చేసి ఫ్యూడల్ ఎస్టేట్లను రైతాంగానికి పంచి పెట్టింది. ఇది పెట్టుబడిదారీ విధాన ప్రారంభ దశలోని పరిణామం. రష్యాలో గాని, ఇతర దేశాల్లో గాని, పెరుగుతున్న కార్మికవర్గ భయానికి పెట్టుబడిదారీ వర్గం పాతశక్తిని కోల్పోయి భూస్వాములతో రాజీపడనారంభించింది. ఇది రైతాంగ ప్రజాస్వామిక ఆకాంక్షలకు భిన్నంగా ఉండి, వారిలో అసంతృప్తిని రాజేస్తున్నది. భూస్వామ్య ఆస్తిపై దాడిచేస్తే అది ప్రతీఘాతమై యావత్ కష్టజీవుల్నీ ఏకంచేసి పెట్టుబడిదారుల ఆస్తిపై తిరగబడేలా చేస్తుందని బూర్జువాలు భయపడ్డారు.

ఆ నిర్దిష్ట పరిస్థితిలో లెనిన్ కార్మికవర్గ నాయకత్వంలో కార్మిక–కార్షక ఐక్యతను ప్రతిపాదించాడు. ఇది ఫ్యూడల్ వ్యతిరేక ప్రజాతంత్ర విప్లవాన్ని పూర్తి చేస్తుందని, అలానే పెట్టుబడిదారీ వ్యతిరేక పోరాటం నుంచి సోషలిస్టు విప్లవం వరకు పురోగమిస్తుందని ప్రతిపాదించాడు. 1905లో రాసిన తన ప్రఖ్యాత గ్రంథం 'ప్రజాతంత్ర విప్లవం'లో సోషల్ డెమోక్రసీ యొక్క రెండు ఎత్తుగడల్లో దాన్నే కింది విధంగా క్రోడీకరించాడు. "పెట్టుబడిదారీ వర్గ నిలకడలేమిని, కులీన వర్గాల ప్రతిఘటనను రైతాంగం బల ప్రయోగంతో కూలదోయాలంటే కార్మిక వర్గం ప్రజాతంత్ర విప్లవాన్ని పరిపూర్తి చేయవలసిందే. జనాభాలోని అర్ధ శ్రామికులను కలగలుపుకుని రైతాంగ, పెటీబూర్జువా వర్గ నిలకడ లేనితనాన్ని అడ్డుకుని బూర్జువా వర్గ ప్రతిఘటనను బలప్రయోగంతో కూలదోసి సోషలిస్టు విప్లవాన్ని జయప్రదం చేయాలంటే కార్మికవర్గం సోషలిస్టు విప్లవాన్ని జయప్రదం చేయాల్సిందే.

కార్మిక కర్షక మైత్రి అనే మౌలిక సూత్రంపై ఆధారపడే, లెనిన్, బోల్షివిక్ పార్టీ అనేక విధానపరమైన నిర్ణయాలను...అక్టోబరు విప్లవం జయప్రదం కాకముందు, తర్వాత కూడా తీసుకున్నారు. రష్యన్ విప్లవం ప్రధాన నినాదం 'శాంతి, భూమి, తిండి' ఈ ఐక్యతనే ప్రతిఫలిస్తోంది. "కార్మికుల, రైతుల, సైనికుల ప్రతినిధులు ఎన్నికైన సోవియట్‌లలో ఒకరికొకరు దగ్గరయ్యారు. రైతాంగంపై తమ నాయకత్వ స్థానాన్ని నిలుపుకోగలిగిన స్థాయిలో కార్మిక వర్గం ఉండాలి. ఆర్థిక వ్యవస్థలో అనవసర దుబారా ఖర్చుల్ని తొలగించడం ద్వారా అది రైతాంగ విశ్వాసాన్ని పొందగలిగి వుండాలి. ఆ విధమైన సామాజిక సంబంధాలు ఆర్థిక వ్యవస్థలో ఉండాలి".

సామ్రాజ్యవాదం విసురుతున్న కొత్త సవాళ్లు

ఇదే పుస్తకంలో లెనిన్ 1916లో సామ్రాజ్యవాదంపై అద్భుతమైన విశ్లేషణ చేశాడు. నేడు, ఒక శతాబ్దానికి పైగా, లెనిన్ వివరించిన సామ్రాజ్యవాదం ప్రాథమిక లక్షణమైన దోపిడీ, అసమానతలు, యుద్ధాలు, విధ్వంసం మరింత ఎక్కువైనాయి. అంతర్జాతీయ విత్తపెట్టుబడి ధ్వంసం చేస్తోంది. యుద్ధాలు, కరువులలో లక్షలాది మంది చనిపోతున్నారు. గ్లోబల్ వార్మింగ్, పర్యావరణ క్షీణత కారణంగా భూగోళం తీవ్ర ప్రమాదంలో పడింది.లెనిన్ కార్మిక–కర్షక మైత్రీ సిద్ధాంతమూ, దాని ఆచరణ రష్యాలోనే కాకుండా చైనా, వియత్నాం, కొరియా, క్యూబాలో సైతం సోషలిస్టు విప్లవాలు విజయవంతం కావటానికి దారితీసింది. విప్లవాలు విజయవంతమైన ఈ దేశాలన్నింటిలో, విప్లవ శక్తులు బూర్జువా–భూస్వామ్య పాలక వర్గాలకు వ్యతిరేకంగాను, ఆ వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచిన సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగాను పోరాటం చేయవలసి వచ్చింది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, నయా ఉదారవాదం కొత్త యుగంలో, నయా–ఫాసిస్ట్, యుద్ధోన్మాద, మతతత్వ, జాత్యహంకార ధోరణులు వికృతంగా తలెత్తుతున్నాయి. ఈ ధోరణులను ప్రతిఘటించటానికి ప్రతి దేశంలో కార్మిక–కర్షక మైత్రిని ఏర్పరచడం, ఆ మైత్రీ బంధాన్ని బలోపేతం చేయడానికున్న ప్రాధాన్యత విశేషంగా పెరిగింది. ఎందుకంటే కార్మికవర్గం, రైతాంగం నేడు ఫ్యూడలిజం, దాని అవశేషాలతో పాటు, నయా ఉదారవాదం దానితో అనుబంధంగా వచ్చే దుష్పరిణామాల పెద్ద దాడిని ఎదుర్కొనవలసి వస్తున్నది. దీనిని దోపిడీకి గురవుతున్న ఈ రెండు ఉత్పత్తి శక్తుల మధ్య మరింత బలమైన మైత్రిబంధాన్ని ఏర్పరచడం ద్వారా మాత్రమే ఓడించగలం.

ప్రభాత్ పట్నాయక్ రాసినట్లు, "చాలావరకు మూడవ ప్రపంచ దేశాలలో విప్లవానుకూల అవకాశాలు కార్మిక–కర్షక మైత్రిని విజయవంతంగా నిర్మించడంపై ఆధారపడి ఉంటాయి. అటువంటి మైత్రి లేకుండా పెట్టుబడిదారీ విధానాన్ని ఓడించలేం. అక్టోబర్ విప్లవం కూడా సాధ్యమయ్యేది కాదు." "ఈ రోజు భూస్వామ్య వ్యతిరేక ప్రజాస్వామిక విప్లవాన్ని పూర్తి చేయడం కోసమే కాకుండా, సమకాలీన ప్రపంచీకరణ అనేక వర్ధమాన దేశాల్లో సృష్టించిన తీవ్రమైన వ్యవసాయ సంక్షోభాన్ని, చిన్న ఉత్పత్తి రంగంలోని సంక్షోభాన్ని అధిగమించడానికి కూడా అటువంటి కార్మిక–కర్షక కూటమి అవసరం. వలసవాద–వ్యతిరేక పోరాట వాగ్దానాలకు అనుగుణంగా, వలస పాలనానంతర ప్రభుత్వాలు అందించిన చిన్నపాటి ఉత్పత్తి రంగానికి వివిధ స్థాయిలలో రాజ్యం ఇస్తున్న మద్దతును ప్రపంచీకరణ నిర్మూలించింది. ఈ రంగాన్ని ప్రపంచమంతటా పరుగులు పెడుతున్న బడా పెట్టుబడి ఆక్రమణకు, ప్రపంచ మార్కెట్లో వుండే ధరల హెచ్చుతగ్గులకు బలిచేసింది.

"ఈ ఆర్థిక వ్యవస్థలలోని పెట్టుబడి రంగాలలో కార్మికుల డిమాండ్ దారుణంగా తగ్గిపోయింది. సహజంగా పెరిగే కార్మికశక్తి కంటే ఇది తక్కువగా ఉంది. పైగా పెట్టుబడిదారులు చిన్న తరహా ఉత్పత్తి రంగంలోకి జొరబడేసరికి కార్మిక జీవితాలు నాశనమైపోయాయి. ఉదాహరణకు గత మూడు దశాబ్దాలలో ఇండియాలోనే నాలుగు లక్షల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.

కార్మిక–కర్షక మైత్రీ బంధానికి కృషి

2000 సంవత్సరంలో తాజాపరిచిన సిపియం కార్య క్రమం 7.6 పేరాలో "ప్రజల ప్రజాతంత్ర కూటమి ఏర్పడ టానికి కార్మికవర్గం, రైతాంగం మధ్య ధృడమైన మైత్రీ బంధం ఉండటం కీలకం. దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడటంలో, విస్తృత ప్రజాతంత్ర పరివర్తన సాధించటంలో ఈ మైత్రీ బంధానికి అత్యంత ప్రాముఖ్యం వుంది. అన్ని విధాలా సామాజిక ప్రగతికి ఈ మిత్రత్వం హామీగా వుంటుంది. విప్లవాన్ని ముందుకు తీసుకుపోవటంలో ఇతర వర్గాల పాత్ర కార్మిక–రైతాంగ కూటమి బలం, స్థిరత్వం మీద ఆధారపడి ఉంది."

భారతదేశంలో కార్మిక–కర్షక మైత్రి సామ్రాజ్యవాద వ్యతిరేక స్వాతంత్ర్య పోరాటంలో, అంతకుముందు జరిగిన కార్మికవర్గం, రైతాంగ చారిత్రాత్మక పోరాట సందర్భాలలో అనేకసార్లు వ్యక్తమైంది. ఇటీవలి సంవత్సరాలలో, 2018 నుంచి 2023 దాకా సిఐటియు, ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్), ఆల్ ఇండియా వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) సంయుక్తంగా చేసిన దేశవ్యాపిత పోరాటాల ద్వారా ఈ దిశలో చైతన్యంతో కూడిన కృషి జరిగింది. దుర్మార్గమైన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఏడాదిపాటు దేశవ్యాపితంగా జరిగిన పోరాటంలో ఈ మైత్రిని సాధించటం గొప్ప విషయం. ఈ పోరాటానికి నాయకత్వం వహించిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) కేంద్ర కార్మిక సంఘాల (సిటియు) నాయకత్వంలో కార్మికవర్గం నుండి అపారమైన మద్దతును అందుకున్నది. అదేవిధంగా సిటియు నాయకత్వంలో జరిగిన దేశావ్యాపిత సమ్మెలకు ఎస్‌కెఎం తన పూర్తి మద్దతును అందించింది. ఈ రెండు వర్గాలు కలిసి సంయుక్తంగా జరిపే పోరాటాలు 2024లో కూడా కొనసాగుతాయి.

ఏమైనప్పటికీ, ఇది ఒక చిన్న ప్రారంభం మాత్రమే. ప్రస్తుతం అధికారంలో వున్న కార్పొరేట్–మతోన్మాద–మనువాద–నిరంకుశ ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి ప్రభుత్వాన్ని ఓడించటానికి మరింత విస్తృతమైన, తీవ్రమైన ఆందోళన, రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణ పరమైన చర్యలు తీసుకోవలసిన అవసరం వుంది. లెనిన్ స్వప్నమైన కార్మిక–కర్షక కూటమిని నిర్మించడానికి భారతదేశంలోని వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు అపారమైన కృషి చేయాలి. అది మాత్రమే భారత దేశంలో నిజమైన విప్లవాత్మక సామాజిక మార్పును సాధించగలదు.

/ వ్యాసకర్త సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు /

వైసిపికి ఇంటా బయటా అసమ్మతి, ఆందోళనల సెగ

పి.సుజాతా వర్మ

దేశ సార్వత్రిక ఎన్నికలు, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కు తోంది. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం అనేక సమస్యలు, సవాళ్ళను ఎదుర్కొంటోంది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు టిక్కెట్లు దొరకని నేతల నుండి పెరుగుతున్న అసమ్మతితో పాటు ప్రభుత్వ ఉద్యోగులతో సహా వివిధ వర్గాల వారి నుండి నిరసనలు, ఆందోళనలను ఎదుర్కొంటోంది.

మరింత మెరుగైన వేతనాలు, ప్రయోజనాలు కావాలని వివిధ విభాగాలకు చెందిన వేలాదిమంది కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అనేక సంఘాలు ఇప్పటికే నిరసనలకు దిగడమో లేదా ఎన్నికల్లోగా ఆందోళనలు చేపట్టడానికి ప్రణాళికలు రూపొందించడమో చేస్తున్నాయి. వారి డిమాండ్లను పరిశీలిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో వారిలో కొంతమంది మాత్రమే తాత్కాలికంగా తమ ఆందోళనలను ఆపారు.

అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సైతం ప్రభుత్వంతో కొంత కాలంగా పోరాడుతున్నారు. ఇతర ప్రభుత్వ సిబ్బందితో సమానంగా తమకు కూడా వేతనాలు పెంచాలని, ఇతర ప్రయోజనాలు కలిగించాలని డిమాండ్ చేస్తూ డిసెంబరు 12 నుండి వారు సమ్మె చేస్తున్నారు. ఆందోళనకారులతో పలు దఫాలుగా జరిగిన చర్చలు విఫలమవడంతో, నిత్యావసరాల నిర్వహణా చట్టం–1992 (ఎస్మా)ను ప్రయోగించడం ద్వారా ఆందోళనలను అణగదొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ అంగన్‌వాడీలు తమ పట్టును ఏమాత్రమూ సడలించలేదు. ఆందోళన విరమించలేదు. తమ డిమాండ్లన్నింటికీ ప్రభుత్వం ఆమోదించేవరకు సమ్మె కొనసాగి తీరుతుందని స్పష్టం చేశారు.

న్యాయమైన తమ డిమాండ్ల పట్ల ప్రభుత్వం దీర్ఘకాలంగా ఉదాసీనంగా వ్యవహరించడంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దశలవారీగా నిరసనలు చేపట్టేందుకు ఎ.పి యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ సమాయత్తమవుతోంది. విజయవాడలో ఫిబ్రవరి మొదటి వారంలో మహా ధర్నాతో ముగించాలని భావిస్తోంది. రూ.18 వేల కోట్ల మేరకు వివిధ పద్దుల కింద పెండింగ్ వున్న తమ బకాయిలు, ఎరియర్లను తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



తమ ఆందోళనలు, డిమాండ్ల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో ఆందోళన చేస్తున్న సంఘాలు తీవ్ర ఆగ్రహంతో వున్నాయి. సమ్మెల పట్ల ప్రభుత్వం తీసుకున్న కఠిన వైఖరితో సమస్య ఇంకా ముదిరిందని అత్యధికులు అభిప్రాయపడుతున్నారు. వేతనాలు పెంచినట్లైతే వాటిని ప్రస్తుత బడ్జెట్లలోనే చెల్లించాల్సిన అవసరం వుంది. అందుకే పరిష్కారాలను కనుగొనడంలో జాప్యం జరుగుతోందనేది వాస్తవం.

పారా మెడికల్ సిబ్బంది, 104, 108 అంబులెన్స్ సర్వీసుల్లో పని చేస్తున్న ఇతర ఉద్యోగులు జనవరి 23 నుండి ప్రతిపాదిత సమ్మెకు ఆరోగ్య శాఖకు నోటీసు ఇచ్చారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వేతనాలు, ఇతర ప్రోత్సాహకాలను పెంచాలని వారు కోరుతున్నారు.

కత్తిరింపులు

ఆంధ్రప్రదేశ్ ఔట్‌సోర్స్‌డ్ సర్వీసెస్ కార్పొరేషన్‌లో తమని భాగం చేసినట్లైతే ఇవన్నీ తమకు వస్తాయని వారు పేర్కొంటున్నారు.

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మితో చర్చలకు తమ నేతలను ఆహ్వానించడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్న ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ వర్కర్లు తాత్కాలికంగా సమ్మె విరమించారు. దాదాపు 55,400 మంది అక్రిడేటెడ్ సామాజిక ఆరోగ్య కార్యకర్తలు కూడా విధులకు దూరంగా వున్నారు. తమకు నెలకు రూ.26 వేలు కనీస వేతనంగా ఇవ్వాలని వారు పట్టుబడుతున్నారు. మున్సిపల్ పాఠశాలలను విద్యా శాఖ పర్యవేక్షణ కిందకు తీసుకువస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులపై మున్సిపల్ టీచర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్లలో కొన్నింటిని అమలు చేయడానికి ప్రభుత్వం అంగీకరించడంతో సమగ్ర శిక్షా పథకానికి చెందిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 22 రోజుల నుండి చేస్తున్న సమ్మెను ఇటీవలే విరమించారు. మధ్యాహ్న భోజన కార్మికులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, నిర్మాణ కార్మికులు, గ్రామ రెవిన్యూ అసిస్టెంట్లు, గ్రామీణాభివృద్ధి విభాగానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు... వీరందరిదీ ఒకటే ఫిర్యాదు. ద్రవ్యోల్బణం నెలకొన్నప్పటికీ తమ ఆదాయాలు అస్సలు పెరగడం లేదని వాపోతున్నారు. 2019 ఎన్నికల సమయంలో పాదయాత్ర సందర్భంగా వేతనాలు పెంచుతానని, మరింత మెరుగైన పని పరిస్థితులు కల్పిస్తానని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఆనాడు హామీ ఇచ్చారని, కానీ నేడు వాటన్నింటినీ గాలికి వదిలేశారని, మాట నిలబెట్టుకోలేదని వారు విమర్శిస్తున్నారు.

తమ ఆందోళనలు, డిమాండ్ల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో ఆందోళన చేస్తున్న సంఘాలు తీవ్ర ఆగ్రహంతో వున్నాయి. సమ్మెల పట్ల ప్రభుత్వం తీసుకున్న కఠిన వైఖరితో సమస్య ఇంకా ముదిరిందని అత్యధికులు అభిప్రాయపడుతున్నారు. వేతనాలు పెంచినట్లైతే వాటిని ప్రస్తుత బడ్జెట్లలోనే చెల్లించాల్సిన అవసరం వుంది. అందుకే పరిష్కారాలను కనుగొనడంలో జాప్యం జరుగుతోందనేది వాస్తవం.

ఇదిలావుండగా, ఈ వైఫల్యాలన్నింటికీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడానికి ఈ నిరసనలు, సమ్మెలు, ఆందోళనలన్నీ కూడా ప్రతిపక్షాలకు ఒక అవకాశాన్ని ఇచ్చాయి. తెలుగుదేశం–జనసేన కూటమి, బిజెపి, కాంగ్రెస్‌లు అన్నీ కూడా జగన్మోహన్ రెడ్డిపై దాడి చేస్తున్నాయి. ఈసారి ప్రజలు ఆయనకు ఓటు వేసేది లేదంటూ గట్టిగా చెబుతున్నాయి. రాష్ట్రానికి సేవ చేసేందుకు ఇచ్చిన 'ఒక్క అవకాశాన్ని' కాలదన్నుకున్నారని అంటున్నాయి.

2019 అసెంబ్లీ ఎన్నికల్లో, మొత్తం 175 అసెంబ్లీ స్థానాలకు గాను జగన్ పార్టీ 151 గెలుచుకుంది. రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాల్లోనూ 22 సీట్లను కైవసం చేసుకుంది. ఇటువంటి సవాళ్ళతో కూడిన సంక్లిష్ట సమయంలో, ఈసారి మొత్తంగా 175 అసెంబ్లీ స్థానాలను గెలుచుకునేలా పార్టీ కార్యకర్తల్లో స్ఫూర్తిని, ఉత్సాహాన్ని నింపేందుకు జగన్మోహన్ రెడ్డి 'వై నాట్ 175' అంటూ ఒక నినాదాన్ని తెర మీదకు తెస్తున్నారు. స్వంత పార్టీలోనూ, బయట పెరుగుతున్న అసమ్మతి ప్రభావం ఎన్నికల ఫలితాలపై ఎలా వుంటుందో అంచనా వేయడం అంత సులభం కాకపోవచ్చు కానీ అందుకుగల అవకాశాలను తోసిపుచ్చలేం.

/'ద హిందూ' సౌజన్యంతో/

జనవాక్యం

మహిళలకూ వృద్ధాప్య పింఛన్లు

సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ విషయంలో ఏ ప్రభుత్వమూ మహిళలను పరిగణలోకి తీసుకోవడం లేదు. ప్రజలు ఆరోగ్యకరమైన కుటుంబ జీవితాన్ని గడపడమంటే ఆధారపడటం తగ్గించడమని అర్థం చేసుకోవాల్సి ఉంది. వైఎస్ఆర్ చేయూత పథకాన్ని ప్రారంభిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 60 యేళ్ల వయస్సు వరకు చేయూత అందుకున్న మహిళలకు ఆ మరుసటి ఏడాది నుండి వృద్ధాప్య పింఛన్లు అందుతాయని గొప్పగా ప్రకటించారు. ఆ మాటలు నీటి మూటలయ్యాయి. 60 యేళ్లు నిండిన డ్వాక్రా మహిలకు ఇచ్చే ఆసరా పింఛన్లు సైతం చేతిలో పెట్టడం లేదు. దేశంలో 48 శాతం వృద్ధ మహిళలు దృష్టి, చలనశీలత, వినికిడి, జ్ఞానానికి సంబంధించిన సమస్యలు ఎదుర్కొంటున్నారని ఒక నివేదిక పేర్కొంది. రక్తపోటు, మధుమేహం వల్ల ఈ సవాళ్లు మరింత తీవ్రం అవుతాయి. 48 శాతం మంది వద్ధ మహిళలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. అంతేకాదు ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం అరవై యేళ్లు నిండిన మహిళల్లో 46 శాతం మంది కొంత వైకల్యం కలిగి ఉన్నారు. ఇదే సమయంలో 73 శాతం మంది వృద్ధులు ప్రయివేట్ దుకాణాల్లోనే మందులు కొనుగోలు చేస్తున్నారని, అధిక ధరల కారణంగా మందులు వాడడం మధ్యలోనే మానేస్తున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. సంక్షేమ పథకాలకు ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కొనే సత్తా ఉండాలి. నష్టాలను భర్తీ చేస్తూ భరోసా ఇవ్వాలి. దేశ జనాభాలో వృద్ధుల సంఖ్య 20 శాతానికి చేరుతున్న తరుణంలో సామాజిక భద్రత పింఛన్ల విధి విధానాలను సమీక్షించాల్సి ఉంది. 24.4 శాతం భారతీయులు మాత్రమే సామాజిక రక్షణ ప్రయోజనాలు పొందుతున్నారని అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక పేర్కొంది. కాబట్టి మహిళలకు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వడం ప్రభుత్వాలకు మోయలేని భారం కాబోదని స్పష్టమవుతోంది.

- ఎన్. కోటేశ్వరరావు,
బాపట్ల జిల్లా.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com



పీనల్ కోడ్‌లో మార్పులపై

స్లొవేకియాలో పెల్లుబికిన ప్రజాగ్రహం

బ్రటిస్లోవా: దేశ శిక్షాస్మృతిలో సమూల మార్పులు చేస్తూ రాబర్ట్ ఫికో నేతృత్వంలోని మితవాద ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు వ్యతిరేకంగా స్లొవేకియాలో ప్రజాగ్రహం కట్టలుతెంచుకుంది. ఈ బిల్లును తక్షణమే వెనక్కి తీసుకోవాలని వేలాదిమంది గురువారం రాజధాని వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. ప్రధానమంత్రి రాబర్ట్ ఫికో నేతృత్వంలోని ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రతిపాదిత మార్పులను అధ్యక్షురాలు జుజానా కాపుటోవా కూడా తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ బిల్లులోని అంశాలు చట్టబద్ధ పాలనను ప్రమాదంలో పడవేయడమే కాదు, సమాజానికి చెప్పలేనంత కీడు కలిగిస్తుందని ఆమె పేర్కొన్నారు. వ్యవస్థీకత నేరాలు , తీవ్రవాదం వంటి వాటిని డీల్ చేసే ప్రత్యేక ప్రాసిక్యూటర్ల కార్యాలయాన్ని రద్దు చేసింది. ఇకపై ఈ నేరాలను ప్రాంతీయ కార్యాలయాల్లోని ప్రాసిక్యూటర్లు చేపడతారని తెలిపింది. దాదాపు 20ఏళ్లుగా ఈ ప్రాంతీయ కార్యాలయాలు ఇటువంటి కేసులను విచారించడం లేదు. తాము తీసుకునే చర్యలను ఆమోదించేందుకు ఫాస్ట్ ట్రాక్ పార్లమెంటరీ పద్ధతిని ఉపయోగించాలని ప్రభుత్వం భావిస్తోంది. మొత్తంగా 24 ప్రధాన నగరాలు, పట్టణాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. చట్టబద్ధ పాలన, ప్రజాస్వామ్యం కోసం జరుపుతున్న ఈ పోరాటాన్ని ఈనాడు యావత్ యూరప్ చూస్తోందని ప్రగతిశీల స్లొవేకియా నేత మైఖేల్ సిమెకా వ్యాఖ్యానించారు.

అధికార దుర్వినియోగం

- 22న ఒక పూట సెలవుపై సిపిఎం పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొనేందుకు వీలుగా ఈ నెల 22న ఒక పూట సెలవును ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం ద్వారా అధికార దుర్వినియోగానికి పాల్పడిందని సిపిఎం విమర్శించింది. పార్టీ పొలిట్‌బ్యూరో శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. 22 వ తేదీ మధ్యాహ్నం 2.30గంటల వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కేంద్ర సంస్థలు, పారిశ్రామిక సంస్థలు మూతబడతాయని ప్రకటిస్తూ ప్రభుత్వం ఆఫీస్ మెమోరాండం జారీ చేసిందని, బిజెపి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇదే విధమైన చర్యలు తీసుకున్నట్లు వార్తలొచ్చాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది. పూర్తిగా మతపరంగా జరుగుతున్న వ్యవహారంలో ప్రభుత్వం, రాజ్యం నేరుగా జోక్యం చేసుకునే దిశగా వేసిన పడిన మరో అడుగుగా పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఉద్యోగులు తమ మత విశ్వాసాలు, వ్యవహారశైలికి సంబంధించిన వ్యక్తిగత ఇష్టాలకు అనుగుణంగా ఎంపిక చేసుకునే హక్కు కలిగివుంటారు, కానీ ఇటువంటి సర్క్యులర్ జారీ చేయడం ద్వారా ప్రభుత్వం తన అధికారాలను తీవ్రంగా దుర్వినియోగ పరిచిందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. రాజ్యం ఏ ఒక్క మత రంగును కలిగి ఉండరాదని పేర్కొంటున్న రాజ్యాంగానికి, సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రభుత్వ చర్యలున్నాయని పొలిట్‌బ్యూరో పునరుద్ఘాటించింది.

అయోధ్య కేసులో తీర్పిచ్చిన

ఆ అయిదుగురికి ఆహ్వానం

న్యూఢిల్లీ, లక్నో : అయోధ్యలో బాబ్రీ మసీదును కూల్చివేసిన చోటే ఆలయ నిర్మాణానికి మార్గం సుగమం చేసేలా కీలకమైన తీర్పును వెలువరించిన ఆనాటి సుప్రీం రాజ్యాంగ ధర్మాసనంలోని ఐదుగురు న్యాయమూర్తులకు అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమ ఆహ్వానం అందింది.వీరితో పాటు న్యాయ మరో 50మంది ప్రముఖులకు కూడా ఆహ్వానాలు అందాయి. మాజీ అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ ఆహ్వానం అందుకున్నవారిలో వున్నారు. అయోధ్య వివాదంలో 2019 నవంబరు 9న రాజ్యాంగ ధర్మాసనం తుది తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. బాబ్రీ మసీదు కూల్చివేయడం దారుణమైన నేరం అంటూనే, మసీదు కూలగొట్టబడిన స్థలాన్ని ఆలయ నిర్మాణానికి బదలాయించాలని కోర్టు ఆదేశించింది. దీనికి బదులుగా మసీదు నిర్మించుకునేందుకు ఐదెకరాల స్థలాన్ని యుపి వక్ఫ్ బోర్డుకు కేటాయించాలని కోరింది. అయోధ్యలో కొలువుదీరనున్న బాలరాముని విగ్రహాన్ని 300 ఏళ్ల నాటి రాయితో చెక్కినట్లు భూగర్భ శాస్త్రవేత్త, మైసూరు యూనివర్శిటీ ఎర్త్ సైన్సెస్ విభాగ ప్రొఫెసర్ సి.శ్రీకంఠప్ప తెలిపారు. దక్షిణ భారతదేశంలో వెలుగు చూసిన అత్యంత ప్రాచీన శిలల్లో ఇదొకటని చెప్పారు. మైసూరు జిల్లాలోని గుగ్గెగౌడన్నపురా క్వారీ నుంచి ఈ రాయిని తీసుకొచ్చినట్లు తెలిపారు.

అయోధ్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో భద్రత పర్యవేక్షణ

అయోధ్యలో హైఅలర్ట్ ప్రకటించారు. 12 వేల మంది పోలీసులతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో భద్రత పర్యవేక్షిస్తున్నారు. అయోధ్యలో ముగ్గురు వ్యక్తులను తీవ్రవాదులుగా అనుమానించి పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు భద్రతను కట్టుదిట్టం చేశారు. సైబర్ నేరగాళ్ల ముప్పును ఎదుర్కొనేందుకు హై లెవల్ సైబర్ నిపుణుల బృందాన్ని కేంద్ర హోం శాఖ అయోధ్యకు పంపించింది.

దక్షిణ చైనా సముద్రంలో ఉద్రిక్తతల నివారణ

- చైనా, ఫిలిప్పైన్స్ మధ్య ఒప్పందం

చైనా: దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో ఏడాది కాలంగా కొనసాగుతునన ఉద్రిక్తతలు, ఘర్షణలను ఉపశమింపజేసేందుకు చైనా, ఫిలిప్పైన్స్ ప్రభుత్వాలు అంగీకరించాయి. ఈ మేరకు రెండు దేశాల మధ్య ఒక ఒప్పందం కుదిరినట్లు చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి శుక్రవారం తెలిపారు. తమ మధ్య విభేదాలను స్నేహపూర్వక చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న దృఢ నిశ్చయంతో ఇరు దేశాలు ఉన్నాయన్నారు.

ఒకే రోజు 355 కరోనా కేసులు

న్యూఢిల్లీ: భారతదేశంలో 355 కొత్త కోవిడ్ -19 కేసులు నమోదయ్యాయి. దేశంలో ఇప్పుడు క్రియాశీల కేసుల సంఖ్య 2,331గా ఉందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం ఉదయం విడుదల చేసిన బులెటిన్‌లో పేర్కొంది. దేశంలో ఇప్పటివరకు మొత్తం 1,378 కోవిడ్-19 సబ్-వేరియంట్ జెఎన్.1 కేసులు నమోదయ్యాయి, మణిపూర్ దాని ఉనికిని గుర్తించిన తాజా రాష్ట్రంగా అవతరించింది. ఇండియన్, జెనోమిక్స్ కన్సార్టియం అనౌన్స్ చేసిన డేటా ప్రకారం మహారాష్ట్రలో అత్యధికంగా 320 వేరియంట్ కేసులు నమోదయ్యాయి, తర్వాత కర్ణాటకలో 234 కేసులు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో 189.1 కేసులు, కేరళలో 156 వేరియంట్ కేసులు నమోదయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లో 96 జెఎన్.1, గోవా (90), తమిళనాడు (89), గుజరాత్ (76) కేసులు నమోదయ్యాయి..

ఇక స్థానిక భాషల్లోనూ ట్రేడింగ్

- సెబీ చీఫ్ ఆవిష్కరణ

ముంబయి : స్టాక్ మార్కెట్లలో సులభ వ్యాపారాన్ని ప్రోత్సహించడానికి వీలుగా సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) (సిడిఎస్ఎల్) అందుబాటులోకి తెచ్చిన బహుళ భాషల విధానాన్ని సెబీ ఛైర్‌పర్సన్ మదాబి పూరి బుచ్ ఆవిష్కరించారు. ఇన్వెస్టర్లు ఇకపై 23 భారతీయ భాషల్లో తమ ట్రేడింగ్ స్టేట్‌మెంట్లను పొందడానికి వీలు కల్పించనుంది. డిమ్యాట్, సెక్యూరిటీ ఖాతాల్లో ఇన్వెస్టర్లు తమకు ఇష్టమైన భాషను ఎంచుకోవచ్చు. తొలుత నాలుగు భాషలతో దీన్ని అందుబాటులోకి తెచ్చారు. అతి త్వరలోనే క్రమంగా అన్ని స్థానిక భాషలు అందుబాటులోకి రానున్నాయి.

అంగన్‌వాడీ దీక్షలకు కొనసాగుతున్న సంఘీభావం

- రైతు, కౌలు రైతుల సంఘాల మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. అంగన్‌వాడీ సంఘాలు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలకు సంఘీభావం కొనసాగుతోంది. మూడో రోజైన శుక్రవారం దీక్షలకు ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. అంగన్‌వాడీ సంఘాల నాయకత్వానికి ఈ రెండు సంఘాలు ప్రధాన కార్యదర్శి కె ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు వేతనం ఎక్కువ ఇస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి మాట తప్పారని విమర్శించారు. నిజానికి అంగన్‌వాడీలు పనిచేయడం వల్లే గర్భిణులు, బాలింతల ఆరోగ్యం, బిడ్డల సంరక్షణ బాగా అభివృద్ధి సాధించిందని తెలిపారు. ప్రభుత్వం తరఫున తల్లి, పిల్లలకు ఎనలేని సేవలు చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించే దిశగా సానుకూలంగా చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఐదేళ్లకోసారి వేతనాలు పెంచుతామని మంత్రులు చెప్పడం సరైంది కాదన్నారు. అంగన్‌వాడీలు తలచుకుంటే ప్రభుత్వ దుర్మార్గాలను ప్రజలకు చేరవేసి ప్రభుత్వ సంగతి తేల్చగలరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, కౌలు రైతు సంఘం కార్యదర్శి ఎం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.25 కోట్లు స్వాధీనం

- బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద పట్టుబడ్డ నగదు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్ (బాపట్ల జిల్లా)

కారులో తరలిస్తున్న రూ.2.25 కోట్ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల జిల్లా మార్టూరు సమీపంలోని బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద పోలీసుల తనిఖీల్లో ఈ నగదు పట్టుబడింది. బాపట్ల డిఎస్‌పి వెంకటేశులు కథనం ప్రకారం.. బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన తనిఖీలలో భాగంగా ఓ కారుని ఆపి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కారులో ఉన్న రూ.2.25 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నగదును బాపట్ల ట్రెజరీకి తరలించి గుంటూరు ఆదాయ పన్నుశాఖ అధికారులకు సమాచారం అందించినట్లు డిఎస్‌పి తెలిపారు.

వాణిజ్య పంటలకు గుంటూరు ఎంతో ఖ్యాతి

- విశాఖ నుంచి గుంటూరు సరుకుల ఎగుమతికి అవకాశం
- విశాఖ పోర్ట్ ట్రస్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

విశాఖపట్నం నుంచి అన్ని రకాల వాణిజ్య ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతికి మెరుగైన అవకాశాలు ఉన్నాయని విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దువే తెలిపారు. గుంటూరులోని ఓ హోటల్లో ఎపి ఛాంబర్ ఆఫ్ కామర్స్, విశాఖ పోర్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో వ్యాపార ప్రముఖులతో శుక్రవారం జరిగిన ముఖాముఖి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర అధ్యక్షులు పి.భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో దుర్గేష్‌కుమార్ దువే మాట్లాడుతూ వాణిజ్య పంటలకు గుంటూరు ఎంతో ఖ్యాతి గడించిందని, గుంటూరు నుంచి వివిధ రాష్ట్రాలు, దేశాలకు సరుకు ఎగుమతికి విశాఖ పోర్టు నుంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అనేక ఆహార ఉత్పత్తుల తయారీ, ఎగుమతులకు గుంటూరు నుంచి విశాఖకు రావడానికి రైలు, రోడ్డు, విమానయాన సేవలు నిరంతరం అందుబాటులో ఉన్నాయన్నారు. మిర్చి, పత్తి, పొగాకు, పసుపు పంటలతోపాటు గ్రానైట్ ఎగుమతికి తమ పోర్టు నుంచి మెరుగైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు పండ్లు, కూరగాయలు, రొయ్యలు, కోడి గుడ్లు, చేపలు ఎగుమతి అవుతున్నాయన్నారు. వస్త్రాలు, రెడీమేడ్, ఇతర వస్త్ర పరిశ్రమలకు సంబంధించిన ఇంజినీరింగ్ ఉత్పత్తులు కూడా ఎగుమతికి సహకరిస్తామని చెప్పారు. విశాఖ పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు మాట్లాడుతూ.. పత్తి, పొగాకు, మిర్చి ఎగుమతులకు సహకరించడం ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని పెంచుతున్నామని తెలిపారు. సమావేశంలో విశాఖ పోర్ట్ ట్రాఫిక్ మేనేజర్ బి.రత్నకుమార్, భారత టుబాకో అసోసియేషన్ అధ్యక్షులు మద్ది వెంకటేశ్వరరావు, ఎపెడా రీజినల్ మేనేజర్ ఆర్.పి.నాయుడు, ఎపి టెక్స్‌టైల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోటిరావు పాల్గొన్నారు.

రామోజీ ఫిలిం సిటీలో ప్రమాదం

- రోప్ వే తెగి విస్టేక్స్ సిఇఒ మృతి
- డైరెక్టర్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



హైదరాబాద్ నగర శివారులోని రామోజీ ఫిలింసిటీలో ప్రమాదం జరిగింది. ఓ వేడుకలో క్రేన్ రోప్‌వే తెగి ఓ కంపెనీ సిఇఒ మృతి చెందారు. వివరాల్లోకెళ్తే.. విస్టేక్స్ కంపెనీ సిల్వర్ జూబ్లీ వేడుకలను రామోజీ ఫిలిం సిటీలో ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం 7:30 గంటల సమయంలో వేడుకలు ప్రారంభించడానికి సర్వం సిద్ధమైంది. వేడుకలకు చికాగోలో నివసించే విస్టేక్స్ కంపెనీ సిఇఒ సంజయ్ షా(57) హాజరయ్యారు. డైరెక్టర్ విశ్వనాథ్‌రాజ్ బట్లాతో కలిసి ఆయనను రోప్‌వే సాయంతో స్టేజీపైకి దింపుతుండగా ఒక్కసారిగా రోప్‌వే తెగి కింద పడిపోయింది. సుమారుగా 20 అడుగుల ఎత్తు నుంచి కింద పడటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా గురువారం అర్ధరాత్రి సంజయ్ షా మృతిచెందారు. విశ్వనాథ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వేడుకల నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సిఐడి విచారణకు హాజరైన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

సినీ దర్శకులు రామ్‌గోపాల్‌వర్మను చంపుతామని బెదిరించిన కేసులో ఇద్దరు టిడిపి నాయకులు శుక్రవారం గుంటూరులో సిఐడి ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, ఐ-టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి బండి శివకేశవకు సిఐడి నోటీసులు జారీ చేసింది. దీంతో వారు విచారణకు హాజరయ్యారు. అధికారులు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సుదీర్ఘంగా విచారించారని, తమను 30 నుండి 40 ప్రశ్నలు వేశారని, తమ మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు జప్తు చేశారని ఫిరోజ్ తెలిపారు. ఈ నెల 30న మరోసారి రావాలని నోటీసులిచ్చినట్లు చెప్పారు.

శ్రీనివాస్‌కు మద్దతుగా టిడిపి నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో అరెస్టయిన జంపని శ్రీనివాస్‌కు మద్దతుగా టిడిపి దళిత నేతలు నిరాహార దీక్షలు చేపట్టారు. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయంలో శుక్రవారం దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. సిఎం జగన్ పథకం ప్రకారమే శ్రీనివాస్‌ను నిందితుడిగా మార్చారని విమర్శించారు.

కోల్డ్ స్టోరేజీలో భారీ అగ్ని ప్రమాదం



దగ్ధమవుతున్న కోల్డ్ స్టోరేజీ బయట ఉన్న సరుకు



మంటలను అదుపు చేసే ప్రయత్నంలో అగ్నిమాపక సిబ్బంది

- మంటల్లో రూ.70 కోట్ల పసుపు

ప్రజాశక్తి - దుగ్గిరాల (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా దుగ్గిరాలలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీలో జరిగిన ప్రమాదంలో సుమారు రూ.70 కోట్ల పసుపు అగ్నికి ఆహుతైంది. ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. దుగ్గిరాల మండలం చెన్నకేశవ నగర్‌లోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజిలో 1.20 లక్షల బస్తాల్లో 70 వేల క్వింటాళ్ల పసుపు నిల్వ ఉంది. శుక్రవారం సాయంత్రం 3.30 గంటల సమయంలో కోల్ట్ స్టోరేజీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడడంతో పరిసర ప్రాంతాల్లో దట్టంగా పొగలు అలుముకున్నాయి. కోల్డ్ స్టోరేజి యజమాని శామ్ మహేశ్వరి అందించిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఐదు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. మంటలు మరింత పెరగడంతో విజయవాడ నుంచి మరో వాహనాన్ని తెప్పించామని రీజనల్ ఫైర్ ఆఫీసర్ జిలాని తెలిపారు. మంటల తీవ్రత వల్ల లోపలికి వెళ్లే పరిస్థితి లేదని, కోల్డ్ స్టోరేజ్ బయట ఉన్న సరుకును మాత్రమే తీసుకొస్తున్నట్లు చెప్పారు. రాత్రి అంతా మంటలను అదుపు చేసే పనిలోనే ఉంటామని తెలిపారు. ఇదిలా ఉండగా కోల్డ్ స్టోరేజ్‌కు బీమా ఉన్నట్లు యజమాని శామ్ మహేశ్వరి తెలిపారు. ప్రస్తుతం క్వింటాలు పసుపు ధర రూ.10 వేలకుపైగా ఉంది. ఈ లెక్కన సుమారు రూ.70 కోట్లకు మించి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకున్న డ్రోన్ లేజర్ షో

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన డ్రోన్ లేజర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో సామాజిక సమతా సంకల్ప సభ ముగిసిన అనంతరం బస్సులో మంత్రులతో కలిసి అంబేద్కర్ విగ్రహం వద్దకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేరుకున్నారు. స్వరాజ్ మైదాన్‌లో సామాజిక న్యాయ మహాశిల్పం పేరుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 125 అడుగుల విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రం 6:40కు బటన్ నొక్కి జగన్ ప్రారంభించారు. ప్రారంభ సూచికగా విగ్రహం వద్ద పెద్దయెత్తున బాణసంచా కాల్చడంతో పాటు లేజర్ షో ప్రదర్శించారు. వెయ్యి డ్రోన్‌లతో ఏర్పాటుచేసిన లేజర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముందుగా భారతదేశ చిత్రపటం, ఆంధ్రప్రదేశ్ చిత్రపటం, గోదావరి బ్రిడ్జి, కర్నూలు కొండారెడ్డి బురుజు, నవరత్నాలతోపాటు ఉన్న జగన్ చిత్రపటం, కూచిపూడి కళాకారిణి, రాష్ట్ర పక్షి చిలుక, భారత రాజ్యాంగ పీఠిక, అంబ్కేదర్‌తోపాటు ఉన్న పార్లమెంట్ భవనం, భారతరత్న బిరుదుతో పాటు అంబేద్కర్ పేరు, చిత్రాలతో పాటు, ప్రారంభించిన అంబేద్కర్ విగ్రహం చిత్రాలను ప్రదర్శించారు. అనంతరం అక్కడే ఏర్పాటుచేసిన కాలచక్ర మహామండపాన్ని, అంబేద్కర్ జీవిత విశేషాలతో ఏర్పాటు చేసిన మ్యూజియాన్ని, కన్వెన్షన్ సెంటర్‌ను, మ్యూజికల్ ఫౌంటెన్, మినీ థియేటర్‌ను ప్రారంభించారు. చివరిగా అంబేద్కర్ పాదాల వద్దకు చేరుకుని ఆయనకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ కె మోషేనురాజు, ఉప ముఖ్యమంత్రులు కె నారాయణ స్వామి, కొట్టు సత్యనారాయణ, తానేటి వనిత, విడదల రజిని, ఆర్‌కె రోజా, ఆదిమూలపు సురేష్, బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున, పినెపి విశ్వరూప్, జోగి రమేష్, చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, ఎంపిలు విజయసాయిరెడ్డి, నందిగం సురేష్, ఎమ్మెల్యేలు మేకతోటి సుచరిత, సామినేని ఉదయభాను, మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు. విగ్రహాన్ని పూర్తిగా విదేశీ వస్తువులతో రూపొందించినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

గనుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు జిల్లా)

ఎపి గనుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీరప్రతాపరెడ్డిపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదయ్యింది. తనకు గ్రానైట్ గనులు ఇప్పిస్తానని మోసం చేసి పెద్దఎత్తున డబ్బులు గుంజారని గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన జక్కిరెడ్డి ప్రభాకరరెడ్డి అనే వ్యక్తి శుక్రవారం ఫిర్యాదు చేశారు. డబ్బులు తిరిగివ్వాలని అడిగితే చంపేస్తామని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు రూ.70 లక్షలకు పైగా డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదుదారు ఆరోపిస్తున్నారు.

'లొకేషన్ మార్కర్'గా విక్రమ్ ల్యాండర్.. నిద్రాణ స్థితిలోనూ సేవలు

బెంగళూరు: చందమామ దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన భారత్ ప్రపంచ దేశాలకు మార్గదర్శిగా నిలుస్తోంది. నిర్దేశించిన లక్ష్యాలకు మించి పని చేసిన చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్.. నిద్రాణ స్థితిలోనూ సేవలందిస్తున్నట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) తాజాగా వెల్లడించింది. ల్యాండర్‌లోని 'ది లేజర్ రెట్రో రిఫ్లెక్టర్ ఎరే' (ఎల్‌ఆర్‌ఎ) పరికరం చంద్రుడి దక్షిణ ధ్రువంపై 'లొకేషన్ మార్కర్'గా పని చేస్తున్నట్లు ఓ ప్రకటన విడుదల చేసింది. ఎల్‌ఆర్‌ఎ నుంచి గతేడాది డిసెంబర్ 12న అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా)కి చెందిన లూనార్ రికనైసెన్స్ ఆర్బిటర్ (ఎల్‌ఆర్‌ఓ) సంకేతాలను గుర్తించినట్లు ఇస్రో పేర్కొంది.

అంతర్జాతీయ సహకార ఒప్పందంలో భాగంగా నాసాకి చెందిన ఎల్‌ఆర్‌ఎను విక్రమ్ ల్యాండర్‌లో పొందుపరిచారు. ఇందులో అర్ధగోళాకార ఆకతిలో 8 కార్నర్ క్యూబ్ రిఫ్లెక్టర్లు ఉంటాయి. ఏదైనా అంతరిక్ష నౌక ద్వారా విడుదలైన లేజర్ కిరణాలను రిఫ్లెక్ట్ (వికిరణం) చేయడం ద్వారా ఉనికిని తెలియజేసేందుకు ఇవి సహకరిస్తాయి. దీని బరువు 20 గ్రాములు. దశాబ్దాల పాటు సేవలు అందించేలా దీనిని రూపొందించారు.

చంద్రయాన్-3 ప్రాజెక్టులో భాగంగా ఇస్రో రూపొందించిన విక్రమ్ ల్యాండర్ ఆగస్టు 23, 2023న చంద్రుడి దక్షిణధ్రువంపై విజయవంతంగా దిగిన సంగతి తెలిసిందే. ప్రజ్ఞాన్ రోవర్‌తో కలిసి 14 రోజుల పాటు విస్తృత పరిశోధనలు చేసిన విక్రమ్.. కీలక సమాచారాన్ని భూమికి చేరవేసింది. అంతరిక్ష రంగంలో ప్రబల శక్తులుగా పేరున్న అమెరికా, రష్యా, చైనా సైతం అసాధ్యమని భావించిన దాన్ని సుసాధ్యం చేసి చూపించింది. జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా అవతరించింది. చంద్రయాన్ -3 అన్వేషణ ప్రారంభమైనప్పటి నుంచి అనేక ఎల్‌ఆర్‌ఏలు పని చేయడం మొదలుపెట్టినప్పటికీ.. ప్రస్తుతానికి ఒక్కటి మాత్రమే అందుబాటులో ఉందని ఇస్రో పేర్కొంది. చంద్రుడి ఉపరితలంపై 'లొకేషన్ మార్కర్'గా పని చేస్తూ.. భవిష్యత్ పరిశోధనలకు ఇది మార్గనిర్దేశం చేస్తుందని తెలిపింది.

'ఒకే దేశం..ఒకే ఎన్నిక' అప్రజాస్వామికం

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే. సూచనల సమర్పణకు గడువు గురువారంతో ముగిసింది.

పలు పార్టీలు వ్యతిరేకం

సిపిఐ(ఎం), సిపిఐ, డిఎంకె, టిఎంసి, ఎంఐఎం, నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) వంటి పలు పార్టీలు కమిటీకి సమర్పించిన సూచనలలో జమిలి ఎన్నికల ప్రతిపాదనను వ్యతిరేకించాయి. కాంగ్రెస్ కూడా ఏకకాలంలో ఎన్నికలను వ్యతిరేకించింది. బిజెపి, దాని మిత్రపక్షాలు కమిటీకి ఎటువంటి అధికారిక అభిప్రాయాన్ని తెలపలేదు. అయితే గతంలో ఈ ప్రతిపాదనకు సూత్రప్రాయంగా మద్దతు ఇచ్చాయి.

21న కమిటీ మూడో భేటీ

ఆదివారం కోవింద్ ఆధ్వర్యంలో హెచ్‌ఎల్‌సి మూడో అధికారిక సమావేశాన్ని నిర్వహించే అవకాశముంది. గతేడాది సెప్టెంబర్‌లో కేంద్రం ఏర్పాటుచేసిన కమిటీ గతంలో సెప్టెంబర్ 23, అక్టోబర్ 25 తేదీల్లో సమావేశమైంది.

లొంగిపోవాల్సిందే

- గడువు పెంచేది లేదు
- బిల్కిస్ బానో కేసులో దోషులకు స్పష్టం చేసిన సుప్రీం

న్యూఢిల్లీ : బిల్కిస్ బానో కేసులో దోషులు లొంగిపోవడానికి మరింత గడువు ఇచ్చేందుకు సుప్రీం కోర్టు శుక్రవారం తిరస్కరించింది. "జనవరి 8న లొంగిపోవాల్సిందిగా మీకు ఆదేశాలు జారీ చేసేటప్పుడు మీ వ్యవహారాలను చక్కదిద్దుకోవడానికే రెండు వారాల గడువు ఇచ్చాం" అని జస్టిస్ బివి నాగరత్న దోషుల తరపు న్యాయవాదులకు తెలిపారు. తమ ఆరోగ్యం బాగా లేదని లేదా తమ కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగా లేదని, కొడుకు పెళ్లి వుందని, పంట ఇంటికి వచ్చే రోజులని, తల్లిదండ్రులకు ఆరోగ్యం బాలేదని... ఇలా దోషులు మళ్లీ జైలుకు వెళ్ళేందుకు మరికొంత గడువు కావాలంటూ పలు కారణాలు చెబుతున్నారు. "మీరు చెబుతున్న కారణాల్లో ఏ ఒక్కటీ కూడా సరైంది కాదు, కోర్టు ఆదేశాలు అమలు కాకుండా ఈ కారణాలేవీ అడ్డుకోలేవు." అని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. భోజన విరామ సమయంలో దీనిపై స్వల్ప సమయం విచారించిన ఆమె పై ఆదేశాలు జారీ చేశారు. లొంగుబాటు ఆదేశాల అమలును వాయిదా వేయాలని కోరుతూ గురువారం నుండి వరుసగా పిటిషన్లు రావడం ఆరంభమయ్యాయి. లొంగుబాటుకు గడువు 20తో ముగుస్తున్నందున అత్యవసరంగా పిటిషన్లు విచారించాలని కోరడంతో జస్టిస్ నాగరత్న శుక్రవారం విచారించారు.





గ్రామీణ బంద్‌లో యాపిల్ రైతులు

- 26న ట్రాక్టర్ పరేడ్, ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్‌కు మద్దతు
- ఎఎఫ్‌ఎఫ్‌ఐ మొదటి జాతీయ మహాసభ పిలుపు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

11 మందితో యాపిల్ ఫార్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఎఫ్‌ఎఫ్‌ఐ) సమన్వయ కమిటీని మహాసభ ఎన్నుకుంది. ఎఎఫ్‌ఎఫ్‌ఐ మొదటి జాతీయ మహాసభ చండీగఢ్‌లోని చీమా భవన్‌లో ఈ నెల 18, 19 తేదీల్లో రెండు రోజులపాటు జరిగింది. జమ్ము-కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌కు చెందిన యాపిల్ రైతులు పాల్గొన్నారు. మూడు రాష్ట్రాల నుంచి మొత్తం 85 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఆర్థిక కార్యదర్శి పి కృష్ణప్రసాద్ మహాసభను ప్రారంభించగా, మాజీ ఎమ్మెల్యే రాకేష్ సింఘా జెండాను ఆవిష్కరించారు. ఈ నెల 18న ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ సోహన్ సింగ్ ఠాకూర్ నివేదికను సమర్పించారు. విస్తృత చర్చ అనంతరం నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎఎఫ్‌ఎఫ్‌ఐ ప్రస్తుతం 10,000 మంది యాపిల్ రైతులతో సభ్యత్వాన్ని కలిగి ఉంది. 2024 చివరి వరకు 56 వేల సభ్యత్వానికి చేరుకోవాలని మహాసభ నిర్ణయించింది.

11 మందితో సమన్వయ కమిటీ

11 మంది సభ్యులతో కూడిన సమన్వయ కమిటీని మహాసభ ఎన్నుకుంది. మాజీ ఎమ్మెల్యే మహ్మద్ యూసుఫ్ తరిగామి, మాజీ ఎమ్మెల్యే రాకేష్ సింఘా సమన్వయకర్తలుగా ఎన్నికయ్యారు. ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ ఉద్వేగభరితమైన ప్రసంగంతో మహాసభ ముగిసింది.

యాపిల్ ధర, భూ చట్టాలపై తీర్మానాలు

జమ్ము-కాశ్మీర్‌లో భూ చట్టాలకు చేసిన సవరణకు వ్యతిరేకంగా మహాసభ తీర్మానాలను ఆమోదించింది. ఇటీవల రాకేష్ సింఘా సమర్పించిన డిమాండ్ల చార్టర్‌ను కూడా ఆమోదించింది. యాపిల్ కోసం లాభదాయకమైన ధరలు, యూనివర్సల్ ప్యాకేజింగ్, సరుకు రవాణా ఛార్జీలు, సబ్సిడీ కోల్డ్ స్టోరేజీలు, యాపిల్‌పై 100 శాతం దిగుమతి సుంకం విధించడం, వాతావరణ మార్పు లు, వ్యాధులపై బీమా, ఉత్పత్తిదారుల సహకార సంఘాలకు మద్దతు మొదలైన వాటిని మహాసభ డిమాండ్ చేసింది.



సభలో మాట్లాడుతున్న విజూ కృష్ణన్

భవిష్యత్తు కర్తవ్యాలు

ఈ చారిత్రాత్మక మహాసభ దేశంలోని యాపిల్ బెల్ట్‌లోని గ్రామ స్థాయి నుండి యాపిల్ రైతుల జీవనోపాధి సమస్యలపై ప్రచారాలను ప్రారంభించాలని, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న ట్రాక్టర్ పరేడ్, ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్‌లో పాల్గొనడంతో తన బలాన్ని అందించాలని యాపిల్ రైతులకు పిలుపునిచ్చింది. ఢిల్లీ సరిహద్దుల్లో చారిత్రాత్మకమైన కిసాన్ ఆందోళనను నిలిపివేసినప్పుడు రైతు సంఘాలకు ప్రధాని మోడీ చేసిన వాగ్దానాలు అమలు చేయకుండా ద్రోహం చేశారని మహాసభ విమర్శించింది.

ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

- ఆరుగురు సజీవదహనం

న్యూఢిల్లీ : ఢిల్లీలోని పితంపురా ప్రాంతంలో గురువారం రాత్రి ఘోర అగ్నిప్రమాదం జరిగి ఆరుగురు సజీవదహనమయ్యారు. పితంపురా ప్రాంతంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు కమ్ము కున్నాయి. రెండు కుటుంబాల సభ్యులు మంటల్లో చిక్కుకున్నారు. ఈ ఘటనలో నలుగురు మహిళలు, ఇద్దరు పురుషులు మతి చెందారు. వీరంతా రెండు వేర్వేరు కుటుంబాలకు చెందినవారు. మొదటి అంతస్తులో చెలరేగిన మంటలు మూడో అంతస్తు వరకూ వ్యాపించాయి. ఎనిమిది ఫైరింజన్లతో ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలోకి ప్రవేశించి మృతదేహాలను బయటకు తీశారు. షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ బంగ్లా ఖాళీ చేసిన మహువా

న్యూఢిల్లీ : తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రా ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేశారు. టెలిగ్రాఫ్ లైన్‌లోని హౌస్ నెంబర్ 9బి బంగ్లాను శుక్రవారం ఉదయం పదిగంటల సమయంలో ఖాళీ చేశారని ఆమె తరపు న్యాయవాది తెలిపారు. ఆ ప్రాంతమంతా బారికేడ్లను ఏర్పాటు చేయడంతో పాటు భారీగా బలగాలను మోహరించారని చెప్పారు. ప్రభుత్వ బంగ్లా నుండి ఆమెను ఖాళీ చేయించేందుకు ఉదయాన్నే డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్స్ (డిఇఒ) అధికారుల బృందాన్ని పంపినట్లు వెల్లడించారు.





బహిరంగ సభకు హాజరైన జనం, సభలో మాట్లాడుతున్న సిఎం జగన్

సామాజిక న్యాయమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

భావజాలం మీద తిరుగబాటుగా ఆయన అభివర్ణించారు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు దళితులకు చేసింది శూన్యమని విమర్శించారు. సెంటు స్థలం కూడా ఇంటి నిర్మాణాలకు ఇవ్వలేదని సిఎం విమర్శించారు. చంద్రబాబు రక్తంలోనే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల మీద ఏ కోశాన ప్రేమ లేదన్నారు. ఎస్‌సిల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని ముఖ్యమంత్రి స్థానంలో ఉండి నోరు పారేసుకున్నారని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ సిఎంలు రాజన్నదొర, అంజద్‌బాష, తానేటి వనిత, మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, తిరుపతి ఎంపి గురుమూర్తి, సామాజిక న్యాయ సలహాదారులు జూపూడి ప్రభాకర్‌రావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారామ్, మండలి ఛైర్మన్ కొయ్యే మోషన్‌రాజు, మంత్రులు బొత్ససత్యనారాయణ, పినిపే విశ్వరూప్, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గాజాలో తక్షణమే కాల్పుల విరమణ

అలీనోద్యమ దేశాల డిమాండ్

గాజా : గాజాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడులను అలీనోద్యమ దేశాల నేతలు తీవ్రంగా ఖండించారు. తక్షణమే కాల్పుల విరమణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉగాండా రాజధాని కంపాలాలో 120 సభ్య దేశాలతో కూడిన అలీనోద్యమ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ నెల 15న ప్రారంభమైన ఈ సమావేశాలు 20వ తేదీ వరకు కొనసాగుతాయి. ప్రతినిధుల సమావేశంలో క్యూబా ఉపాధ్యక్షుడు సాల్వడార్ వాల్డెస్ మెసా శుక్రవారం మాట్లాడుతూ, "మేం ఎంతో నాగరికులమని చెప్పుకునే పశ్చిమ దేశాల నేతలు గాజాలో మహిళల, చిన్నారుల హత్యలను, ఆస్పత్రులు, పాఠశాలలపై విచక్షణారహిత బాంబు దాడులను, ప్రజలకు సురక్షితమైన తాగునీరు, ఆహారం అందకపోవడాన్ని ఏ విధంగా సమర్థిస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఆఫ్రికన్ యూనియన్ కమిషన్ ఛైర్‌పర్సన్ మౌసా ఫాకీ మహమత్ మాట్లాడుతూ, పాలస్తీనియన్లపై సాగుతున్న ఈ అన్యాయమైన యుద్ధాన్ని తక్షణమే విరమించాలని పిలుపునిచ్చారు. ఆఫ్రికా దేశాల్లో దాదాపు సగం దేశాలు అలీనోద్యమంలో భాగంగా వున్నాయి. 1965లో ఏర్పడిన ఈ సంస్థ దక్షిణ సూడాన్‌కు తాజాగా సభ్యత్వం మంజూరు చేయనుంది. ఇదిలావుండగా, గాజాలో గత 24 గంటల్లో మొత్తంగా టెలికమ్యూనికేషన్ సంబంధాలు స్తంభించాయి. గాజాలోని వివిధ ప్రాంతాల్లో ఇజ్రాయిల్ దాడుల్లో డజన్ల సంఖ్యలో మరణించారు. ఈ దాడుల్లో తమవారు ఎవరైనా జీవించి వున్నారేమోనని కుటుంబ సభ్యులు శిథిలాల్లో పడి వెతకడం కనిపిస్తోంది. ఇప్పటివరకు గాజాలో 24,762మంది మరణించగా, 62,108మంది గాయపడ్డారు. ఖాన్ యూనిస్‌లోని నాసర్ ఆస్పత్రిలో పరిస్థితులు భరించరానివిగా వున్నాయని అక్కడి డాక్టర్లు చెబుతున్నారు.

ఇజ్రాయిల్‌కు మద్దతు ఆపండి : అమెరికాను కోరిన పాలస్తీనా అథారిటీ

ఆక్రమిత ప్రాంతాల్లో ఇజ్రాయిల్ చేపడుతున్న దురాక్రమణ చర్యలను అమెరికా తక్షణమే ఆపాలని పాలస్తీనా అథారిటీ కోరింది. పాలస్తీనా అథారిటీకి సంస్కరణలు చేపట్టాలంటూ వాషింగ్టన్ కోరిందని వార్తలు వచ్చిన నేపథ్యంలో పాలస్తీనా డిప్యూటీ ప్రధాని నబిల్ అబూ రుదైనా మాట్లాడుతూ, అథారిటీలో ఏ మార్పు జరిగినా అది పాలస్తీనా ఎజెండాకు తగినట్లుగా వుంటుంది తప్ప విదేశాలు చెప్పినట్లు జరగదని అన్నారు.

షరతులతో కూడిన కాల్పుల విరమణ ఇయు తీర్మానం

బ్రసెల్స్: గాజాలో పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధంలో శాశ్వత కాల్పుల విరమణకు పిలుపునిచ్చే తీర్మానాన్ని యూరోపియన్ యూనియన్ (ఇయు) పార్లమెంటు ఆమోదించింది, అయితే, ఈ కాల్పుల విరమణకు అది ఒక షరతు పెట్టింది. హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేయాలి, దాని వద్ద ఉన్న బందీలందరినీ విడుదల చేయాలన్నదే ఆ షరతు. గాజాలో ఇజ్రాయెల్ బాంబుదాడులకు ముగింపు పలకడానికి యూరపు దేశాలు ఇంతవరకు నిరాకరిస్తూ వస్తున్నాయి. ఈ తీర్మానానికి ఇయు కూటమిలోని దేశాలన్నీ బద్ధులై ఉంటాయని చెప్పలేం. కానీ ఇయు వైఖరిలో కొంత మార్పు వచ్చిందనడానికి ప్రతీకగా ఇది ఉంటుంది.

మణిపూర్‌లో మళ్లీ హింస

ఇంఫాల్ : ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో హింస కొనసాగుతున్నది. గత 48 గంటల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మెయితీలు, కుకీల ప్రాబల్యం ఉన్న జిల్లాల సరిహద్దులో వేర్వేరు ప్రాంతాల్లో కాల్పులు జరిగాయి. ఫలితంగా రెండు వేర్వేరు సంఘటనల్లో కనీసం ఐదుగురు మెయితీలు గురువారం మరణించారు. బుధవారం రాత్రి లోయలోని తౌబాల్ జిల్లాలో పోలీసు సంస్థల నుంచి ఆయుధాలను దోచుకునే ప్రయత్నాలు జరిగాయి. ఇందులో ముగ్గురు బిఎస్‌ఎఫ్ సిబ్బందికి బుల్లెట్ గాయాలయ్యాయి. ఈ నెల 17న మిలిటెంట్ గ్రూపులు, భద్రతా దళాల మధ్య కాల్పుల్లో ఇండియన్ రిజర్వ్ బెటాలియన్ (ఐఆర్‌బి) జవాను, మణిపూర్ రైఫిల్స్ జవాన్ మరణించిన సంగతి తెలిసిందే. ప్రధాని మౌనం వీడి సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకుడు పవన్‌ఖేరా, ప్రతిపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు.



మీ కోసం

ఒక ఉల్లిపాయ తీసుకుని పైన కొంచెం లోతుగా కట్ చేసుకోవాలి. అందులో నూనెతో తడిపిన పత్తి ఒత్తి వేసి వెలిగిస్తే సాయంత్రం వేళల్లో వచ్చే దోమలు, ఈగల బెడద తగ్గుతుంది.

జీవన సౌరభం

పని చెయ్యాలనుకునే వారికి దారి దొరుకుతుంది.
చెయ్యకూడదనుకునే వారికి సాకు దొరుకుతుంది.

విజయం



హోప్ ఇయర్లీ పరీక్షల్లో దినేష్‌కి అన్ని సబ్జెక్టుల్లోనూ తక్కువ మార్కులు వచ్చాయి. తనతోపాటు ఉండే సంతోష్‌కి మంచి మార్కులు వచ్చాయి. ఆ రహస్యమేమిటో తెలుసుకోవాలని సంతోష్ దగ్గరకి వెళ్లాడు.


"సంతోష్, నేను కష్టపడి చదువుతా. కానీ పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తున్నాయి. ఎందుకో అర్థం కావడం లేదు. నువ్వెలా మంచి మార్కులు సాధిస్తున్నావు? నాకు కూడా ఆ రహస్యం చెప్పవా?" అని అడిగాడు.


దానికి సంతోష్ "నువ్వు ఒక తప్పు చేస్తున్నావు. ఏరోజు పాఠం ప్రశ్నలు ఆ రోజు చదవటం లేదు. సెల్ చూసుకుంటూ కాలం గడిపేస్తున్నావు. దీంతో చదవకుండా మిగిలిపోయిన పాఠాలు చాలా ఉండిపోతున్నాయి. పరీక్షలు వచ్చేసరికి చదవాల్సిన ప్రశ్నలు ఎక్కువై ఇబ్బంది పడుతున్నావు. అదే నీ లోపం" అని వివరించాడు.

"ఈసారైనా అన్నీ చదువు. ముఖ్యంగా ఏ రోజు పాఠం ఆ రోజు చదువు. సెల్ ఫోన్ దూరం పెట్టు. అప్పుడే అన్నిటిలో మంచి మార్కులు వస్తాయి" అని చెప్పాడు.

ఆ రోజు నుంచి దినేష్ సెల్ ఫోన్ దూరం పెట్టాడు. ఏకాగ్రతతో చదవటం ప్రారంభించాడు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాడు.

– కనుమ ఎల్లారెడ్డి, 93915 23027





చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ వరుసగా ఉన్న అంకెలను కలిపితే ఒక కూరగాయ బొమ్మ వస్తుంది. ట్రై చేయండి మరి.

నేను గీసిన బొమ్మ





కె.లత ఏంజెల్,
4వ తరగతి, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్),
వేగవరం, ఏలూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆన్‌లైన్ ఆర్థిక మోసాలపై అప్రమత్తం కండి!



ప్రస్తుతం ఇంటర్నెట్ ప్రపంచంలో జీవిస్తున్నాం. ఆన్‌లైన్ వేదికగా జరిగే ఆర్థిక మోసాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి. ముఖ్యంగా లోన్‌యాప్‌లు ద్వారా జరిగే సైబర్ నేరాలపై అప్రమత్తతతో మెలగాలి. తీసుకున్న రుణం సకాలం కట్టకపోయినా, ఆలస్యమైనా సదరు బాధితులను రుణ యాప్‌లు నానా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అసభ్య పదజాలంతో దూషించడం, వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేసి మానసికంగా కుంగదీస్తున్నారు. దీంతో, ఎన్నో కుటుంబాలు బలైన వార్తలు వింటూనే ఉన్నాం. అలాగే మోసానికి గురైన హైద్రాబాద్‌కి చెందిన ఓ యువ ఇంజినీరు దాని నుంచి ఎలా బయటపడ్డాడు? ప్రస్తుతం బాధితులకు అండగా ఏం చేస్తున్నాడు? అనే విషయాలను కూడా తెలుసుకుందాం.

ఇటీవల 'మనీ–9' అనే సంస్థ చేసిన వ్యక్తిగత ఫైనాన్స్ సర్వే ప్రకారం.. దేశంలోని 100 కుటుంబాల్లో ప్రతి 18 మంది కుటుంబాలు సైబర్ క్రైమ్‌ను ఎదుర్కొంటున్నారు. భారత్‌లో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ఈ సర్వే వెల్లడించింది. ఇది 10 విభిన్న భాషల్లో 35 వేల కంటే ఎక్కువ కుటుంబాల మధ్య నిర్వహించింది. సైబర్ క్రైమ్‌ను ఎదుర్కొన్న వారిలో 50 శాతం మంది ఆర్థిక మోసాల బారిన పడ్డారు. 25 శాతం మంది వ్యక్తిగత సమాచారం, గుర్తింపుకు సంబంధించి వేధింపులను ఎదుర్కొన్నారు. 12 శాతం మంది కుటుంబాలు సోషల్ మీడియా ఖాతాలు లేదా మొబైల్ ఫోన్‌లను హ్యాకింగ్ చేయడం వంటి సంఘటనల బారిన పడ్డాయని సర్వే సూచిస్తోంది. అదనంగా, 13 శాతం మంది ఇతర రకాల సైబర్ నేరాలను ఎదుర్కొన్నట్లు సర్వేలో తేలింది.

పెరుగుతున్న సైబర్ క్రైమ్, సైబర్ మోసాలపై కూడా ఈ సర్వే ఫోకస్ పెట్టింది. సైబర్ మోసంగా పిలిచే ఆర్థిక మోసం ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నట్లు స్పష్టం చేసింది. దాదాపు ప్రతిరోజూ దేశంలో ఎక్కడో ఓ చోట సైబర్ మోసాల బారిన పడుతున్న వారు ఉన్నారు. ఈ మోసంలో వేల నుంచి లక్షల రూపాయల వరకు పోగొట్టుకుంటున్నారని సర్వేలో తేలింది.

వీటిలో డెబిట్/ క్రెడిట్ కార్డ్ మోసాలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మోసాలు, యుపిఐ మోసాలు, కొరియర్ మోసాలు, ఇతర రకాల మోసాలు ఉన్నాయి. స్కామర్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ప్రజలను దోపిడీ చేస్తున్నట్లు గుర్తించారు. సాంకేతిక పరిజ్ఞానం లేని వారు, తక్కువ డిజిటల్ అక్షరాస్యత ఉన్నవారు. సైబర్ క్రైమ్ బాధితులుగా మారే ప్రమాదం ఎక్కువగా ఉందని సర్వే పేర్కొంది.


ఈ మధ్య కాలంలో వర్క్ ఫ్రమ్ హోమ్‌కు సంబంధించిన యాప్‌లు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. ఆ లింక్‌ని క్లిక్ చేసినా, లేదా ఆన్‌లైన్‌లో ఏదేని వీడియో పోస్ట్ చేసినా మన సమాచారం సైబర్ నేరగాళ్లకి వెళ్లిపోతుంది. ఇలాంటి సందర్భాల్లో తప్పనిసరిగా పోలీసుల సాయం తీసుకోవాలి. అయితే, ప్రజలు ఫిర్యాదులు చేసినా కేసులు నమోదు చేయని సంఘటనలే ఎక్కువగా ఉంటున్నాయని సర్వేలో తేలింది. బాధితులు సైబర్ క్రైమ్‌కి సంబంధించిన ఫిర్యాదులను నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫైల్ చేయడమే దీనికి ఉదాహరణ. ఈ ప్లాట్‌ఫామ్ గణాంకాల ప్రకారం.. జనవరి 2020, డిసెంబర్ 2022 మధ్య.. పోర్టల్‌లో సైబర్‌క్రైమ్‌పై 1.6 మిలియన్ ఫిర్యాదులు వచ్చాయి. అయితే వీటిలో 32 వేలు మాత్రమే పోలీసు కేసులుగా మారాయి.

మోసాల నుంచి రక్షణ ఎలా?

డేటా రక్షించుకోవాలి : ఫోన్ డేటా సురక్షితంగా ఉందా లేదా అని ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ ఉండాలి.

- సాధారణంగా ఏదైనా అప్లికేషన్ యాక్సెస్ చేసినప్పుడు కెమెరా, కాంటాక్ట్‌లు, జిమెయిల్ ఖాతా, లొకేషన్‌కి యాక్సెస్ ఇస్తుంటారు. ఇలాంటప్పుడే సైబర్ నేరానికి గురయ్యే ప్రమాదముంటుంది. కాబట్టి అత్యవసరమైన యాప్‌లు మాత్రమే ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అలాగే అనవసరమైన యాక్సెస్‌లు ఇవ్వకుండా జాగ్రత్త పడాలి. ఇంకో ముఖ్య విషయమేంటంటే డౌన్‌లోడ్ చేసిన యాప్‌లకు ఉండకూడని యాక్సెస్ ఏదైనా ఉందా లేదా అని క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవాలి.
- జీమెయిల్‌కి ఫోన్ లింక్ చేయడం వల్ల గ్యాలరీ సమాచారం, పరిచయాల వివరాలు సైబర్ నేరగాళ్లకు సులభంగా తెలిసే వీలుంటుంది. కాబట్టి సాధ్యమైనంత వరకు జీమెయిల్ వినియోగాన్ని తగ్గించుకోవాలి. అలాగే ల్యాప్‌ట్యాప్‌లో కెమెరాను మాస్క్ చేయాలి.

గోప్యతా సెట్టింగ్‌ల మార్పు : సైబర్ క్రైమ్ జరిగినప్పుడు వాట్సాప్ డేటా ముందుగా చోరీ చేయబడుతుంది. కాబట్టి వాట్సాప్‌లో ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ ఉండేలా చూసుకోవాలి.



- పరిచయం లేని వ్యక్తుల వాట్సాప్ లింక్‌లను తొలగించుకుంటూ ఉండాలి.
- గోప్యతా సెట్టింగులు మార్చుకోవడం వల్ల ఐపి చిరునామాలను రక్షించినట్లౌవుతుంది. సైబర్ నేరానికి గురి కాకుండా ఉండాలంటే ఇది తప్పని సరి.

ఫోన్ రీబూట్ : ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా సైబర్ క్రైమ్‌కి గురైతే వెంటనే వాట్సాప్ ఖాతాను డీయాక్టివేట్ చేయాలి. గ్యాలరీ నుండి ఫొటోలను తీసేయాలి. ఆ తరువాత ఫోన్‌ని రీబూట్ చేయాలి.

పోలీసులను ఆశ్రయించాలి : సైబర్ నేరం జరిగిందని గుర్తించిన వెంటనే పోలీసులను సంప్రదించాలి. సైబర్ క్రైమ్ సెల్‌లు కేవలం నేరస్తుల సమాచారాన్ని మాత్రమే ఇస్తాయి. నిందితులను పట్టుకునేది పోలీసులే. కాబట్టి పోలీసుల జోక్యం ఉంటే సులభంగా బయటపడగలం.

ఫిర్యాదులను సైబర్ క్రైమ్.gov.in లో నమోదు చేయాలి

- ఈ పోర్టల్ ఆర్థిక మోసాలు, సైబర్ క్రైమ్‌పై దృష్టి సారిస్తుంది. ఇందులో ఫిర్యాదు చేయడం వల్ల ప్రతి సారీ పోలీస్ స్టేషనుకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. పైగా ఈ పోర్టల్‌లో బాధితుల వివరాలు ఇవ్వకుండా అంటే అనామకంగా నివేదించే వీలు కూడా ఉంది.

ఈయన కూడా బాధితుడే!

ప్రకాశం జిల్లాకు చెందిన రాధా కృష్ణమూర్తి ఉపాధి నిమిత్తం హైద్రాబాద్‌కి వచ్చారు. కంప్యూటర్ ఇంజినీర్‌గా ఉజ్వల భవిష్యత్తు కోసం ఎన్నో కలలు కన్నారు. కోవిడ్ కాలం ఆయన కలలను చెల్లాచెదురు చేసింది. అందరూ సొంతూళ్లకి వెళ్లిపోతుంటే మూర్తి హైద్రాబాద్‌లోనే ఉండిపోయారు. పోలీస్ విభాగం ఆధ్వర్యంలో కోవిడ్ వాలంటీర్‌గా విధులు నిర్వహించారు. మూర్తి ఇంజినీర్ అయినా సైబర్ సెక్యూరిటీపై ఆసక్తి ఎక్కువ. దానికి సంబంధించిన ఓ కంపెనీలో పనిచేశారు. కమిషనర్ సైబర్ సెక్యూరిటీ సెల్ ద్వారా స్కూళ్లు, కాలేజీలకు వెళ్లి సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించేవారు. అయితే, ఆయన చేసిన ఓ చిన్న పొరబాటు సైబర్ క్రైమ్ బాధితుడిని చేసింది. 'కరోనా సమయంలో చేతిలో డబ్బుల్లేక ఓ యాప్‌లో రూ.6000 రుణం తీసుకున్నాను. అయితే ఆ వెబ్‌సైట్ లింక్ ఏదేని బ్యాంక్‌కి గాని, ఆర్‌బిఐకి గాని అనుసంధానం చేసి లేదని గుర్తించాను. దీంతో ఆ సొమ్ము వెంటనే రీఫండ్ చేయాలని అనుకున్నాను. ఆ విషయం యాప్ నిర్వాహకులకు చెబితే– రోజుకు 18 శాతం వడ్డీతో ఆరు రోజుల వ్యవధిలో చెల్లించమన్నారు. నా దగ్గర అంత సొమ్ము లేదు. దీంతో వాళ్లు నాకు ఫోన్ చేసి చాలా అసభ్యంగా మాట్లాడారు. ఆ తరువాత నా ఫొటోలను మార్ఫింగ్ చేసి నా పరిచయాలన్నింటికీ దాదాపు 1500 మందికి పంపారు. అప్పుడు మా నాన్న నాకు ఫోన్ చేసి 'బతికుండగానే నన్ను చంపేశావురా' అని ఏడ్చాడు. ఆయనొక టీచర్. 'నీ కొడుకు ఇంత నీచంగా తయారయ్యాడేంటి? అని అందరూ అంటున్నారని బోరుమన్నాడు.

ఆ సమయంలో మానసికంగా బాగా కుంగిపోయాను. అప్పుడే నాకు హైద్రాబాద్ అప్పటి పోలీస్ కమిషనర్ సజ్జనార్ నుంచి ఫోను వచ్చింది. నా కాంటాక్ట్ లిస్ట్‌లో ఉన్న ఆయన నంబరుకు కూడా నా మార్ఫింగ్ ఫొటోలు పదే పదే వచ్చినట్లు ఆయన చెప్పారు. జరిగినదంతా తెలుసుకుని నాకు ధైర్యం చెప్పారు. సైబర్ నేరగాళ్లను పట్టుకున్నారు. అప్పుడే నేను నిర్ణయించుకున్నాను. నాలాగే ఎవరూ ఈ బాధ పడకూడదని. 'గ్లోబల్ సెక్యూరిటీ కౌన్సిల్' ప్రారంభించి, బాధితులకు అండగా నిలబడుతున్నాను. ఇప్పటి వరకు 32 మందిని సైబర్ నేరం నుండి విముక్తులను చేశాను' అని మూర్తి చెప్పారు.

'బింబిసార-2' నేను చేయడం లేదు : వశిష్ట




కళ్యాణ్‌రామ్, వశిష్ట కాంబోలో తెరకెక్కిన 'బింబిసార' చిత్రానికి సీక్వెల్ ఉంటుందని గతంలో ప్రకటించారు. తొలి భాగం తెరకెక్కించిన వశిష్టే రెండో భాగం కూడా రూపొందిస్తారని అందరూ భావించారు. తాజా సమాచారం ప్రకారం వశిష్ట ఈ ప్రాజెక్టు చేయడం లేదు. దీనిపై ఆయనే స్వయంగా స్పందించారు. ప్రస్తుతం చిరంజీవితో 'విశ్వంభర' తెరకెక్కిస్తున్న వశిష్ట ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ విషయం స్పష్టం చేశారు. 'ప్రస్తుతం నేను చిరంజీవి గారి సినిమా మాత్రేమే చేస్తున్నా.. బింబిసార–2 కథ పై నాకు చాలా ఆలోచనలు ఉన్నాయి. కళ్యాణ్ రామ్‌కు చెప్పే నేను ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నా. అదే సమయంలో నాకు 'విశ్వంభర' ఆఫర్ వచ్చింది. కళ్యాణ్ రామ్ అనుమతి తీసుకున్న తర్వాతే ఈ ప్రాజెక్ట్‌ను ఓకే చేశా' అని తెలిపారు.

ఆస్కార్ బరిలో భారతీయ చిత్రాలు



ఆస్కార్ 2024కి భారతదేశం నుంచి పలు చిత్రాలను ఎంపిక చెయ్యనున్నారు. ఇప్పటివరకు ఆస్కార్‌కు నామినేట్ అయిన సినిమాల వివరాలు ఇవి. ది స్టోరీటెల్లర్ (హిందీ), సంగీత పాఠశాల (హిందీ), శ్రీమతి ఛటర్జీ వర్సెస్ నార్వే (హిందీ), డంకీ (హిందీ), 12th ఫెయిల్ (హిందీ), విడుతలై పార్ట్ 1 (తమిళం), ఘూమర్ (హిందీ), దసరా (తెలుగు), జ్విగాటో (హిందీ), రాకీ ఔర్ రాణి కి ప్రేమ్ కహానీ (హిందీ), కేరళ స్టోరీ (హిందీ), 2018 (మలయాళం). ఇదే జాబితాలో వాల్వి (మరాఠీ), గదర్ 2 (హిందీ), అబ్‌తో సబ్ భగవాన్ భరోస్ (హిందీ), బాప్ లియోక్ (మరాఠీ) వంటి చిత్రాలకు చోటు దక్కే అవకాశం ఉందని, రాబోయే రోజుల్లో ఈ సినిమాల జాబితా పెరగనుందని కూడా వార్తలు వినిపిస్తున్నాయి.

'ఈగల్' విడుదలపై ఫిలిం ఛాంబర్‌కు



హీరో రవితేజ నటించిన 'ఈగల్' విడుదల కోసం మరోసారి ఫిలిం ఛాంబర్‌ను నిర్మాణ సంస్థ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ఆశ్రయించింది. ఈనెల 13న విడుదల కావాల్సిన ఈ సినిమా ఛాంబర్ పెద్దల నిర్ణయం మేరకు సంక్రాంతి బరి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. తాజాగా ఫిబ్రవరి 9న విడుదలకు సిద్ధమైంది. ఇప్పుడు అదేరోజు 'ఊరు భైరవకోన', 'టిల్లు స్క్వేర్' సినిమాలు విడుదల చేస్తామంటూ ఆయా చిత్రాల నిర్మాతలు కూడా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమకిచ్చిన 'సోలో రిలీజ్ డేట్' మాటను నిలబెట్టుకోవాలని ఛాంబర్‌ను సదరు నిర్మాణ సంస్థ కోరింది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా అనుపమ పరమేశ్వరన్, కావ్యాథాపర్ నటించారు. నవదీప్, మధుబాల తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఫిబ్రవరి 9కు కూడా మరో రెండు సినిమాలు పోటీకి రావటంతో ఛాంబర్ ప్రతినిధులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

త్వరలో 'గ్రాండ్ సక్సెస్ పార్టీ'

"గుంటూరు కారం' సినిమా ప్రీమియర్స్ అనంతరం వచ్చిన రివ్యూలు చూసి షాకయ్యా. కానీ హీరో మహేష్‌బాబు స్ట్రాంగ్‌గా ఉన్నారు. సెకండ్ డే నుంచే రివ్యూలు అనుకున్నట్లుగా మారాయి. మంచి రెవెన్యూ వచ్చింది. త్వరలోనే మేము గ్రాండ్ సక్సెస్ పార్టీ నిర్వహించాలనుకుంటున్నాం' అని నిర్మాత నాగవంశీ చెప్పారు. ప్రీమియర్ షోల తర్వాత ఆన్‌లైన్‌లో జరిగిన హంగామా వల్ల ప్రేక్షకులు కాస్త గందరగోళానికి గురయ్యారన్నారు. ఫస్ట్ షో తర్వాత పాజిటివ్ రివ్యూలు వచ్చాయన్నారు. ఫ్యామిలీ ఆడియన్స్ తమ చిత్రాన్ని చూసి ఆనందిస్తున్నారన్నారు. తల్లీకొడుకుల సెంటిమెంట్ వర్కౌట్ అయ్యిందనీ, అందుకే మంచి రెస్పాన్స్ వచ్చిందని వివరించారు. ప్రేక్షకులు మాస్ ఎంటర్‌టైనర్ అని భావించారనీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అనే విషయాన్ని విడుదలకు ముందే తాము సరిగ్గా చెప్పలేకపోయామని అన్నారు.



ఒలింపిక్స్ బెర్త్ ఆశలు ఆవిరి

- కాంస్య పతక పోటీలనూ జపాన్ చేతిలో ఓటమి
- ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ



రాంచీ: పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో మహిళా క్రీడాకారిణులు నిరాశపరిచారు. శుక్రవారం జరిగిన కాంస్య పతక పోటీలో భారత్ 0–1గోల్‌తో జపాన్ చేతిలో ఓటమిపాలై 2024 ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో భారత మహిళా క్రీడాకారిణులు విఫలమయ్యారు. మ్యాచ్ ప్రారంభంలో జపాన్ క్రీడాకారిణులు భారత్‌పై ఆధిక్యతను సంపాదించారు. దీంతో తొలి క్వార్టర్ 4వ ని.లోనే జపాన్‌కు తొలి పెనాల్టీ కార్నర్ లభించింది. ఆ కార్నర్‌ను భారత గోల్‌కీపర్, కెప్టెన్ సవిత అద్భుతంగా అడ్డుకున్నా.. 6వ ని.లో లభించిన మరో పెనాల్టీని జపాన్ గోల్ చేసింది. దీంతో జపాన్ 1–0 ఆధిక్యతలోకి వెళ్లింది. జపాన్ తరఫున ఆ గోల్‌ను కనా యురంటా కొట్టింది. ఆ తర్వాత ఇరుజట్లు తొలి క్వార్టర్‌లో మరో గోల్ చేయకపోవడంతో భారత్ 0–1గోల్స్‌తో వెనుకబడింది. ఇక రెండు, మూడు, నాలు క్వార్టర్‌లలో ఇరుజట్లు ఎంత ప్రయత్నించినా గోల్ చేయలేకపోయాయి. ముఖ్యంగా మూడో క్వార్టర్‌లో భారత్‌కు పలు మార్లు పెనాల్టీ కార్నర్‌లు లభించినా ప్రయోజనం లేకపోయింది. చివరి క్వార్టర్‌లో పోరాడినా గోల్ చేయడంలో విఫలమయ్యారు. టోర్నీలో భాగంగా గ్రూప్ లీగ్ దశలో అమెరికా చేతిలో ఓడినా.. ఆ తర్వాత న్యూజిలాండ్, ఇటలీలపై గెలుపుతో సెమీస్ బెర్త్ ఖాయం చేసుకున్న అమ్మాయిలు గురువారం పటిష్ట జర్మనీ చేతిలో షూటౌట్‌లో ఓడారు. బలమైన జట్టుపై మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్న అమ్మాయిలు ఒక్కరోజు వ్యవధిలోనే జపాన్‌తో మ్యాచ్ ఆడడం ప్రతికూల ఫలితాన్నిచ్చింది.

ప్రి క్వార్టర్స్‌కు జకోవిచ్, సిట్సిపాస్

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి టాప్‌సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ ప్రవేశించాడు. రికార్డు గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల వేటలో ఉన్న జకోవిచ్ శుక్రవారం జరిగిన మూడోరౌండ్‌లో 6–3, 6–3, 7–6(7–2)తో 30వ సీడ్, అర్జెంటీనాకు చెందిన ఎచెవెర్రిను చిత్తుచేశాడు. తొలి రెండు సెట్‌లను సునాయాసంగా నెగ్గిన జకోవిచ్.. మూడోసెట్‌ను గెలిచేందుకు టైబ్రేక్ వరకు ఆడాల్సి వచ్చింది. ఇతర మూడోరౌండ్ పోటీల్లో 10వ సీడ్ డిమినార్(ఆస్ట్రేలియా) 6–3, 6–3, 6–1తో ఫ్లానియె(ఇటలీ)ను, 12వ సీడ్ ఫ్రిట్జ్(అమెరికా) 3–6, 6–4, 6–2, 6–2తో మరొజ్సాన్(పోలండ్)ను ఓడించారు. ఇక 7వ సీడ్ సిట్సిపాస్(గ్రీక్) 6–3, 6–0, 6–4తో ఎల్–వాన్–అస్సే(ఫ్రాన్స్)ను, 4వ సీడ్ సిన్నర్(పోలండ్) 6–0, 6–1, 6–3తో 26వ సీడ్, బేజ్(అర్జెంటీనా)ను ఓడించి ప్రి క్వార్టర్స్‌కు చేరారు.

గాఫ్ జోరు..



మహిళల సింగిల్స్‌లో అమెరికా యువ సంచలనం, 4వ సీడ్ కోకా గాఫ్ జోరు కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన 3వ రౌండ్ పోటీలో గాఫ్ 6–0, 6–2తో సహచర క్రీడాకారిణి పార్క్స్‌ను చిత్తు చేసింది. మరో పోటీలో 2వ సీడ్ సబలెంకా(రష్యా) 6–0, 6–0తో 28వ సీడ్ సురెంకో(ఉక్రెయిన్)ను ఓడించింది. ఇతర పోటీల్లో ఎం. ఫ్రెచ్(పోలండ్), కోస్ట్యుక్(ఉక్రెయిన్), మరియా టిమోఫీవా(రష్యా)ను చిత్తుచేసి ప్రి క్వార్టర్స్‌కు చేరారు.

మూడోరౌండ్‌కు బొప్పన్న జోడీ..

భారత ఆటగాడు రోహన్ బొప్పన జోడీ పురుషుల డబుల్స్ మూడోరౌండ్‌లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన రెండోరౌండ్ పోటీలో బొప్పన్న–ఎబ్డెన్(ఆస్ట్రేలియా) జోడీ 6–2, 6–4తో ఆస్ట్రేలియాకు చెందిన మిల్మన్–వింటర్‌లను ఓడించారు. 2వ సీడ్‌గా బరిలోకి దిగిన బొప్పన్న జోడీ

ఒలింపిక్స్ నుంచి ఇజ్రాయెల్‌ను బహిష్కరించండి

- ఐఒసికి పాలస్తీనా పౌర సమాజం విజ్ఞప్తి

గాజా: గాజాలో యుద్ధ నేరాలకు పాల్పడుతున్న ఇజ్రాయెల్‌ను ఒలింపిక్స్ నుంచి బహిష్కరించాలని పాలస్తీనా క్రీడాకారులు, పౌర సమాజం డిమాండ్ చేసింది. 300 కంటే ఎక్కువ పాలస్తీనా స్పోర్ట్స్ క్లబ్‌లు, డజన్ల కొద్దీ పాలస్తీనా పౌర సమాజ సంస్థలు ఈ మేరకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసి)ని కోరాయి.పాలస్తీనియన్ పురుషులు , మహిళల ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ , వాలీబాల్ క్లబ్‌లు, ఇజ్రాయెల్ సైనికులచే చంపబడిన వారి ఆటగాళ్ల కుటుంబ సభ్యులు సంయుక్తంగా ఈ పిలుపునిచ్చాయి. "తదుపరి ఒలింపిక్ క్రీడల నుండి ఇజ్రాయెల్‌ను నిషేధించడం ద్వారా ఒలింపిక్ కమిటీ తన గౌరవాన్ని, విశిష్టతను నిలబెట్టుకోవాలని పాలస్తీనా పౌర సమాజం కోరింది. అంతర్జాతీయ చట్టాలను కాలరాచి గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న, వర్ణ వివక్ష, జాతి నిర్మూలన చర్యలకు ఇంతవరకు 24,000 మందికి పైగా పాలస్తీనియన్లు చనిపోయారు, ఇజ్రాయిల్ దాడిలో అమాయక పౌరులు, జర్నలిస్టులు, క్రీడాకారులు అనేక మంది చనిపోయారనిగాజాలోని పాలస్తీనా ఒలింపిక్ కమిటీ కార్యాలయాన్ని కూడా ధ్వంసంచేశాయని పాలస్తీనా ఒలింపిక్ ఫుట్‌బాల్ టీమ్ కోచ్, కెప్టెన్ హనీ అల్–మస్దర్ పేర్కొన్నారు.



ఐఓసి అధ్యక్షులు థామస్ బాచ్

దక్షిణాఫ్రికాలో వర్ణ వివక్ష రాజ్యమేలినప్పుడు ఆ దేశాన్ని ఒలింపిక్స్‌తో సహా అన్ని అంతర్జాతీయ క్రీడా పోటీల నుంచి బహిష్కరించారు. ఇప్పుడు ఇజ్రాయిల్‌కు అదే సూత్రాన్ని వర్తింపజేయడంద్వారా ఐఒసి తన నిబద్ధతను చాటుకోవాలని పాలస్తీనా పౌర సమాజం కోరింది. ఇజ్రాయిల్‌ను ఒలింపిక్స్‌కు అనుమతించడమంటే అది సాగిస్తున్న వర్ణ వివక్ష, యుద్ధ నేరాలకు మద్దతు తెలపడమేనని పేర్కొంది.

ఆంధ్ర 188ఆలౌట్

అస్సాంతో రంజీట్రోఫీ మ్యాచ్

డిస్పూర్(అస్సాం): రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్–బిలో అస్సాంపై ఆంధ్ర జట్టు బ్యాటర్స్ చేతులెత్తేశారు. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర 72.1ఓవర్లలో 188పరుగులకే కుప్పకూలింది. అస్సాం బౌలర్లు చెలరేగడంతో ఆంధ్ర ఓ దశలో 70పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో నితీశ్ కుమార్(49), షోయబ్(63) 7వ వికెట్‌కు 113పరుగులు జతచేశారు. వీరిద్దరూ ఔటయ్యాక మరో ఐదు పరుగుల వ్యవధిలో మిగిలిన వికెట్లను కోల్పోయింది. కెప్టెన్ రికీ బుయ్(24), హనుమ విహారి(4), వికెట్ కీపర్ గిరినాథ్(14), రషీద్(9) నిరాశపరిచారు. అస్సాం బౌలర్లలో రాహుల్‌సింగ్‌కు నాలుగు, ముక్తార్ హుస్సేన్‌కు రెండు, సిద్ధార్థ్, ఆకాశ్‌సేన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అస్సాం జట్టు తొలిరోజు ఆట నిలిచే సమయానికి వికెట్ నష్టపోకుండా 43పరుగులు చేసింది. రిషబ్(18), రాహుల్(21) క్రీజ్‌లో ఉన్నారు.

త్యాగరాజన్ దెబ్బకు సిక్కిం ధమాల్..

ప్లేట్ విభాగంలో సిక్కింతో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు భారీస్కోర్ దిశగా దూసుకెళ్తోంది. తొలుత సిక్కింను 79పరుగులకే పరిమితం చేసిన హైదరాబాద్.. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగి తొలిరోజు ఆట ముగిసే సమయానికి 2వికెట్ల నష్టానికి 313పరుగులు చేసింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్(137) సెంచరీకి తోడు, రాహుల్ సింగ్(83) బ్యాటింగ్‌లో రాణించారు.

సెమీస్‌కు ప్రణయ్

పురుషుల డబుల్స్‌లోనూ..

ఇండియా ఓపెన్ సూపర్–750



న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ సూపర్–750 పురుషుల సింగిల్స్, డబుల్స్‌లో భారత షట్లర్లు సెమీఫైనల్‌కు చేరారు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో హెచ్ఎస్ ప్రణయ్ రాయ్ 21–11, 17–21, 21–18తో వాంగ్–జు–వుయ్(చైనీస్ తైపీ)ను చిత్తుచేశాడు. ఈ గెలుపులో ముఖాముఖి పోరులో ప్రణయ్ 5–3 ఆధిక్యతలో నిలిచాడు. శనివారం జరిగే సెమీస్‌లో ప్రణయ్ 6వ సీడ్ చైనాకు చెందిన షి–యు–క్యూతో తలపడనున్నాడు. ఇక డబుల్స్‌లో సాత్విక్–చిరాగ్ జంట 21–7, 21–10తో డెన్మార్క్‌కు చెందిన అస్ట్రఫ్–రామ్సుహేన్‌ను చిత్తుచేశారు. ఏకపక్షంగా సాగిన డబుల్స్ మ్యాచ్‌లో భారత జంటకు తిరుగులేకుండా పోయింది. సెమీస్‌లో సాత్విక్–చిరాగ్ జంట 4వ సీడ్ మలేషియా జోడీతో తలపడనున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68